ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

అమ్మకు మోసం..



అక్క..చెల్లెమ్మలకు అండగా ఉంటా.. మీ ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే వారందరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున అమ్మఒడి ఇస్తాను. మీరు వారిని మంచి చదువులు చదివించుకోవచ్చు అని.. గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ మాట ఇచ్చి అధికారంలోకి రాగానే నాలుక మడతేశారు. ఇంట్లో ఎంతమంది ఉన్నా ఒక్కరికే అమ్మఒడి ఇస్తూ అందునా అనేక ఆంక్షలు పెట్టి లబ్ధిదారులకు కోత వేసి అక్క చెల్లెమ్మలను మోసం చేశారు. మాట తప్పడం జగనన్న నైజం..



- అమ్మఒడికి ఎన్ని నిబంధనలో..
- మాట తప్పి.. మడమ తిప్పడం జగన్ నైజం
- ఎముక లేని నాలుక.. ఎన్ని అబద్ధాలో..?
- అమ్మఒడిపై పదేపదే మాట మార్చిన జగన్
- సొంత ఇల్లు.. కరెంటు బిల్లుల సాకుతో..

అమ్మఒడికి ఎగనామం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఎముక లేని నాలుక ఏమైనా మాట్లాడుతుంది.. అంటారు.. అందుకు పెద్ద ఉదాహరణగా అమ్మఒడి పథకం విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలనే తీసుకోవచ్చు. ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో జగన్ ప్రజలకు ఇచ్చిన హామీ.. అమ్మఒడి పథకం.. ఈ పథకాన్ని నవరత్నాలలో చేర్చుతున్నట్లు.. చాలా గొప్పగా చెప్పారు. ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే.. వాళ్లందరికీ ఏడాదికి రూ. 15 వేల చొప్పున ఇస్తామన్నారు. ప్రజలకు హామీ ఇచ్చేటపుడు ఈ పథకంలో అర్హుల ఎంపికకు ఎటువంటి నిబంధనలు పెట్టబోతున్నారో..? ఎక్కడా చెప్పలేదు. దీంతో జనం గుడ్డిగా నమ్మి.. ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకున్నా.. పిల్లల చదువులకు ఫీజుల గురించి భయపడాల్సిన అవసరం లేదని అనుకుని వైసీపీని గెలిపించారు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోగానే.. జగనన్న ఈ పథకంపై మొదటిసారి మాట తప్పి మడమ తిప్పేశారు. ఇంట్లో ఒక విద్యార్థికే ఈ పథకం వర్తిస్తుందన్నారు. మొదటి ఏడాది తల్లుల బ్యాంకు అకౌంట్లలో రూ.15 వేలు జమ చేశారు. రెండవ ఏడాది కరోనా కోటాలో అమ్మఒడికి బ్రేక్ పడింది. మూడవ ఏడాది జగనన్న మరోసారి మాట తప్పారు.. మడమ తిప్పేశారు. స్కూల్‌లో మరుగుదొడ్ల నిర్వహణ పేరుతో 15 వేల నుంచి 14 వేలకు కుదించారు. అర్హుల ఎంపికలో అప్పటి వరకు లేని కొత్తకొత్త నిబంధనలు వచ్చి చేరాయి. నాల్గవ ఏడాది దానిని రూ.13 వేలకు తగ్గించారు. ఐదవ సంవత్సరం రూ.13 వేలకు బటన్లు నొక్కినా.. తల్లుల అకౌంట్లలో డబ్బు జమ కాలేదు. ఎప్పుడో నెల, రెండు నెలల తర్వాత (కొందరికి విడతల వారీగా) అకౌంట్లలో పడింది.

ఎన్నెన్ని నిబంధనలు

రాష్ట్ర ప్రభుత్వం 2020 జనవరిలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట చెప్పిన ప్రకారం.. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలకు అమ్మఒడి పథకం వర్తిస్తుంది. 1వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు విద్యార్థులు అర్హులు. తల్లి ఆధార్‌కార్డు, విద్యార్థి ఆధార్‌కార్డు ఉండాలి. పాఠశాలలు, కళాశాలల్లో 75 శాతం హాజరు ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు అయి ఉండకూడదు. తొలుత ఇటువంటి నిబంధనలే ఉన్నాయి. అయితే తర్వాత.. కరెంటు బిల్లులు (300 యూనిట్లు మించి కాల్చకూడదు), సొంత ఇల్లు ఉండకూడదు, కారు ఉండకూడదు, ప్లాట్లు (కొలతలు ఎంత ఉండాలో నిర్దేశించారు) ఉండకూడదు వంటి అనేక నిబంధనలు చేర్చారు. ఫలితంగా ఏటా అమ్మఒడి లబ్ధిదారులు తగ్గిపోతూనే ఉన్నారు. కొత్తగా పాఠశాలల్లో చేరే విద్యార్థులతో పోల్చితే.. అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్య పెరగలేదు. దీంతో అమ్మఒడి పథకంపై తల్లులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏడాదికి రూ.15 వేలు ఇస్తుందని సొంత ఇల్లు కూడా ఉండకూడదా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వమే విచ్చలవిడిగా కరెంటు బిల్లులు పెంచి.. బిల్లులు పెరిగాయి కాబట్టి.. అమ్మఒడి రాదంటే ఎలా? అని వాపోతున్నారు.

ఇన్ని షరతులు పెట్టి.. ఇదేమి అమ్మఒడి..



ఇంట్లో చదువుకునే పిల్లలు అందరికీ అమ్మఒడి రూ.15 వేలు ఇస్తామన్నారు. కానీ ఇంట్లో ఒకరికే ఇస్తున్నారు. అది కూడా ఎక్కడా లేని నిబంధనలు పెట్టారు. 75 శాతం విద్యార్థుల హాజరు ఉండాలంట.. 300 యూనిట్లు కరెంటు కాలకూడదంట.. రూ.15 వేలు అయినా సక్రమంగా ఇచ్చారా..? అంటే అదీ లేదు. మూడోసారి వేయి, నాలుగో సారి రెండు వేలు పట్టుకున్నాడు. ఇదేంది అమ్మఒడి.

- ఎం.ఉష, దేవళంవీధి, మదనపల్లె

అమ్మఒడి మొదటి విడత నొక్కేశారు..



ప్రతి పిల్లాడికి రూ.15 వేలు అమ్మఒడి ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పారు. అన్ని అర్హతలు ఉన్నా.. బ్యాంకు ఖాతా ఇన్‌యాక్టివ్‌గా ఉండడంతో డబ్బు పడలేదు. తర్వాత రెండో సంవత్సరం రూ.14 వేలు, మూడో విడత రూ.13 వేలు ఇచ్చారు. బ్యాంకు ఖాతా యాక్టివేట్ చేసినా తిరిగి డబ్బు వేయలేదు. లబ్ధిదారులు తగ్గితే చాలు.. అనే విధంగా ప్రభుత్వం వ్యవహరించింది. చాలా మందికి వివిధ కారణాలతో డబ్బు పడలేదు.

- రామాంజులమ్మ, దుద్యాల, సంబేపల్లె

అమ్మఒడి అట్టర్ ఫ్లాప్..



అమ్మఒడి అట్టర్‌ఫ్లాప్ పథకం.. కుటుంబంలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ అమ్మఒడి పథకాన్ని ఇస్తామని ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే.. ఒకరికి మాత్రమే అని మాట మార్చారు. తర్వాత కరెంటు బిల్లులు, ఇన్‌కంట్యాక్స్, భూములు, స్థలాలు, సొంత ఇళ్లు వంటి నిబంధనలు పెట్టారు. మొదటి సంవత్సరం ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇచ్చారు. రెండవ సంవత్సరం రూ.14 వేలు..తర్వాత దానిని రూ.13 వేలకు కుదించారు. ఈ ఐదు సంవత్సరాలలో మాకు రెండు సంవత్సరాలు మాత్రమే అమ్మఒడి వచ్చింది. మిగిలిన మూడు సంవత్సరాలు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపించింది.

- కాల్వపల్లె ఈశ్వర్‌రెడ్డి, నూలివీడు, గాలివీడు

ఒకరికే అమ్మఒడి ఇస్తే.. మిగిలిన బిడ్డలూ..?



నాకు ముగ్గురు ఆడబిడ్డలు. ముగ్గురినీ చదివిస్తున్నా.. ఒకరికి మాత్రమే అమ్మఒడి వస్తుంది. నా భర్త పెయింటింగ్ పని చేస్తాడు. చాలీచాలని డబ్బుతో ముగ్గురు పిల్లలను చదివించడం కష్టంగా ఉంది. చంద్రబాబునాయుడు ఎంత మంది పిల్లలు ఉన్నా..అందరికీ వేస్తా అంటున్నాడు. ఈ పథకంతో నా పిల్లలు అందరినీ చదివించుకుంటా.. ఒకరికే అమ్మఒడి వస్తే. .మిగిలిన పిల్లలను చదువు మానిపించాల్సి వచ్చేది.

- రాజేశ్వరి, పుల్లంపేట

మూడు నెలలు బ్రేక్



- ఆగస్టు 4 వరకూ శుభకార్యాలకు అడ్డంకి
- గురు, శుక్ర మూఢమి, ఆషాఢ మాసాలే కారణం
- రాజకీయ నాయకులకు కాస్త వెసులుబాటు

కలికిరి, మే 1: ఊపిరి సలపకుండా ఏప్రిల్ నెలలో కళకళలాడిన కల్యాణ మండపాలకు ఇక నుంచి మరో మూడు నెలలు విరామం ఏర్పడింది. రానున్న ఆగస్టు 4 తర్వాతే తిరిగి శుభ ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి. తెలుగులో చెప్పాలంటే వైశాఖ, జ్యేష్ట, ఆషాఢ మాసాల్లో వివాహాలు, శంకుస్థాపనలు, విగ్రహ ప్రతిష్ఠలు, గృహ ప్రవేశాల వంటి విశిష్ట కార్యక్రమాలకు మంచి రోజులు లేవని పండితులు చెబుతున్నారు. సూర్యకాంతి గురు గ్రహంపై పడినప్పుడు గురు మౌఢ్యమి, శుక్రగ్రహంపై పడినప్పుడు శుక్ర మౌఢ్యమి సంక్రమిస్తుందని దీంతో ఆయా గ్రహాల ఆగమన గమనాలను లెక్కించడానికి సాధ్యం కానందువల్ల శుభ ముహూర్తాలను నిర్ధారించలేమని వీరంటున్నారు. సాధారణంగా వేసవి కాలంలో పెళ్లిళ్లతో సహా వివిధ శుభ కార్యాలు నిరాటంకంగా జరిగేవి. పురోహితులు చెబుతున్న దాని ప్రకారం ఏప్రిల్ 28న చైత్ర బహుళ చవితి నుంచి జూలై 8వ తేదీ సోమవారం వరకు ఆషాఢ శుద్ధ తదియ శుక్ర మౌఢ్యమి ఉంటుంది. అదే విధంగా మే 7వ తేదీ మంగళవారం చైత్ర బహుళ చతుర్ధశి నుంచి జూన్ 7వ తేదీ గురువారం వరకూ జ్యేష్ట శుక్ల పాడ్యమి కొనసాగుతుంది. ఆ తరువాత యథాప్రకారం జూలై 6 నుంచి ఆగస్టు 4 వరకూ ఆషాఢ మాసం రావడంతో వరుసగా నాలుగు నెలల పాటు శుభ కార్యాలకు పూర్తి విరామం లభించినట్లయ్యింది. మూఢాలు, ఆషాఢాల కారణంగా ముహూర్తాలు కొరవడటంతో శుభ కార్యాలపై ఆధారపడిన పురోహితులు, భజంత్రీలు, పూల వ్యాపారాలు, వస్త్ర, స్వర్ణాభరణాల దుకాణాల వ్యవహారాలు మందగించనున్నాయని అంటున్నారు. ఇక కల్యాణ మండపాల సంగతి సరేసరి. కాగా ఎన్నికల వాతావరణంలో ఏప్రిల్ నెలలో రాజకీయ నాయకులు ఊపిరి సలపకుండా రోజుకు ఐదారు పెళ్లిళ్లకు హాజరయ్యారు. వాళ్ల హడావిడి కారణంగా తెల్లవారు జామున పెళ్లిళ్లకు కూడా వరసపెట్టి పాల్గొన్నారు. ఇక మే, జూన్ నెలలు కూడా రాజకీయంగా సందోహంగానే ఉంటుంది. ఆపై ఆగస్టు 4వ తేదీ తరువాత మళ్లీ శుభ ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి.

అన్ని వర్గాల సంక్షేమానికే ఉమ్మడి మ్యానిఫెస్టో

- రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



టీడీపీ మ్యానిఫెస్టో ప్రతులను ఆవిష్కరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నాయకులు

రాజంపేట టౌన్, మే 1 : అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ టీడీపీ, జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో రూపొందించారని, ఇది ఎంతో అద్భుతంగా ఉందని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం రాజంపేట పార్లమెంటు కార్యాలయంలో మ్యానిఫెస్టోను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడి అప్పులపాలైన రాష్ట్రాన్ని గట్టెక్కించాలని, పేద ప్రజలను ధనికులను చేయాలన్న ఉద్దేశ్యంతో ఉమ్మడి మ్యానిఫెస్టో రూపొందించారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు, పన్నులు విపరీతంగా పెరిగాయన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు, భూఆక్రమణలకు అంతే లేకుండా పోయిందన్నారు. జగన్ ప్రభుత్వం 13 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని లూటీ చేసిందన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో టీడీపీ కూటమిని గెలిపించుకుంటే రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో తీసుకెళతారని తెలిపారు. చంద్రబాబు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో పాటు యువత ఉద్యోగాలకు ప్రాధాన్యత ఇచ్చారని, చంద్రబాబు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీతో పాటు యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యం నాయుడు, మైనారిటీ నాయకుడు ముస్తాక్ హుస్సేన్, రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, పోలి శివకుమార్, తెలుగు యువత అధికార ప్రతినిధి పరుశురాంనాయుడు, సోషియల్ మీడియా కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, గుణశంకర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

జీతాలు పడ్డాయి

- పెన్షన్లు కూడా...
- రెండేళ్ల క్రితం ఇవ్వాల్సిన డీఏతో సహా చెల్లింపు
- బ్యాంకులకు సెలవైనా ఖాతాల్లో జమ

కలికిరి, మే 1: వైసీపీ ప్రభుత్వంలో మొదటిసారి ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు జమయ్యాయి. మే డే సందర్భంగా బుధవారం బ్యాంకులకు సెలవు రోజయినా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాలు మాత్రం ఖాతాల్లో పడ్డాయి. అదే విధంగా విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు కూడా వారి ఖాతాల్లో జమ చేశారు. ఎప్పుడూ వారం, పదిహేను రోజుల్లోగా జీతాలు చూసి ఎరుగని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీరా పోలింగ్‌కు పది రోజుల ముందు సరిగ్గా నెల మొదటి రోజునే జరిగిన ఈ చెల్లింపులను చూసి ఇది కొత్త రకం ఎత్తుగడగా చెప్పుకుంటున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షన్‌దార్లలో పెల్లుబుకుతున్న ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రతను తగ్గించడానికి ఎవరూ డిమాండు చేయకుండానే ఒకటవ తేదీ వేతనాలు జమ చేయడంపై సర్వత్రా చర్చించుకుంటున్నారు. అయితే 16 నెలల డీఏ బకాయిల ఊసు మాత్రం లేదు గానీ ఒక నెల డీఏ 3.64 శాతం జీతాల్లో కలపడం కొసమెరుపుగా చెబుతున్నారు. ఒకటో తేదీన జీతాలు జమ కావడం సంతోషం కాదా అని కొంతమందిని విచారించగా ఫస్టు ఇదే లాస్టు ఇదేనన్న రీతిలో నిర్వేదంగా సమాధానాలు వస్తున్నాయి.

న్యాయం కోసం వెళితే చితకబాదారు

- భర్త దాడిలో గాయపడిన భార్య, అత్త



న్యాయం కోసం వెళ్లిన అత్తను కొడుతున్న అల్లుడు



కోడలు స్వప్న జుట్టుపట్టుకుని చితకబాదుతున్న అత్త,మామ

మదనపల్లె టౌన్, మే 1: భార్యాభర్తల వివాహబంధం విషయమై కోర్టులో కేసు జరుగుతుండగా, భర్త రెండో వివాహం చేసుకున్నాడని అతడి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న భార్య, అత్తపై ఆమె భర్త, మామ కలసి నిర్దాక్షిణ్యంగా దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. పుంగనూరుకు చెందిన శకుంతలమ్మ కుమార్తె టి.స్వప్న (28)ను ఏడేళ్ల క్రితం వాల్మీకిపురం మండలం భూమకవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు ఎం.నరసింహులు(34)తో వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. రెండేళ్ల క్రితం వీరిద్దరి మధ్య బేధాభిప్రాయాలు వచ్చి మదనపల్లె కోర్టులో కేసులు వేసుకున్నారు. తీర్పు రాకముందే నరసింహులు రెండో వివాహం చేసుకుని ఇంకో కొడుకును కన్నాడని స్వప్న తెలుసుకుంది. ఈ విషయమై పలుమార్లు భర్త ఇంటికి వెళ్లి నిలదీసింది. ఈ క్రమంలో బుధవారం స్వప్న, ఆమె తల్లి శకుంతలమ్మ దేవతానగర్‌లోని నరసింహులు ఇంటి వద్దకు వెళ్లి తనకు న్యాయం జరగాలని నిరసనకు దిగారు. దీంతో రెడ్డెప్ప, ఆయన కుమారుడు నరసింహులు అక్కడికి చేరుకుని అమ్మ, కూతురు ఇద్దరిని తన్నుతూ చితకబాదారు. స్థానికులు ఈ ఘటనను వీడియో తీసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. దీంతో పాటు గాయపడి మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శకుంతలమ్మను పోలీసులు విచారించి ఆమె ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నారు. బాధితురాలు స్వప్న ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్ఐ విచారిస్తున్నారు.

పట్టపగలే కత్తితో వీరంగం

- ఆస్తి వివాదంతో తమ్ముడిని కత్తితో నరికిన అన్న



తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులురెడ్డి

మదనపల్లె టౌన్, మే 1: ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం గొడవలతో ప్రారంభమై, హత్యాయత్నం వరకు దారి తీసింది. తమ్ముడు తన ఆస్తిని కాజేశాడని అతడి అన్న, ఆయన కుమారుడు పట్టపగలే అందరూ చూస్తుండగా కత్తితో దారుణంగా నరకడంతో పాటు, కత్తిని చూపిస్తూ వీరంగం సృష్టించారు. మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డు ఎస్టేట్ ప్రాంతంలో నరసింహారెడ్డి కుమారుడు ఎస్.శ్రీనివాసులురెడ్డి (47), ఆయన భార్య రాధారాణి నివశిస్తున్నారు. శ్రీనివాసులురెడ్డి అన్న రమణారెడ్డికి, శ్రీనివాసులురెడ్డికి మధ్య ఇంటి స్థలం విషయమై చాలా రోజులుగా వివాదం నడుస్తోంది. ఈ విషయమై పలుమార్లు గొడవ పడ్డారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం రమణారెడ్డి, అతడి కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డితో కలసి శ్రీనివాసులురెడ్డి ఇంటి వద్దకు వెళ్లి అతడితో గొడవ పడి వెంట తెచ్చుకున్న పొడవాటి కత్తితో శ్రీనివాసులురెడ్డిని విచక్షణారహితంగా నరికి తీవ్రంగా గాయపరిచారు. పట్టపగలు ప్రజలందరూ చూస్తుండగా వీరిద్దరూ కత్తి చేతపట్టుకుని వీరంగం చేశారు. దీంతో కత్తితో తిరుగుతున్న రమణారెడ్డిని స్థానికులు ఫొటోలు తీయడంతో వీరిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. కాగా రక్తపుమడుగులో పడి ఉన్న శ్రీనివాసులురెడ్డిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అతడి పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ యువరాజు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కత్తిని చేతిలో పట్టుకుని తిరుగుతున్న రమణారెడ్డి

నేడు రాయచోటికి చంద్రబాబు రాక



రాయచోటి, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాగళంలో భాగంగా ఎన్నికల ప్రచారానికి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం సాయంత్రం రాయచోటి పట్టణానికి వస్తున్నారు. హైదరాబాదు నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు రింగురోడ్డులోని రాజధాని కల్యాణమండపం వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 3.20 గంటలకు బంగ్లా సర్కిల్‌కు చేరుకుంటారు. 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంగ్లా సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 5.10 గంటలకు అక్కడి నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో కడపలో జరిగే బహిరంగ సభకు వెళతారు. ఈమేరకు స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. భారీ జనసమీకరణ చేస్తున్నారు.

బాధ్యతతో ఎన్నికల విధులు నిర్వర్తించండి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మే 1: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల సమర్థవంత నిర్వహణపై నోడల్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ జరిగే సాధారణ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసి పోలింగ్‌ను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటర్ల సంఖ్య తదితర సమాచారం ఎన్నిక అబ్జర్వర్లకు ఇవ్వాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ ఎన్నికల్లో ఎటువంటి సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో ముఖ్యంగా కో-ఆర్డినేషన్ సెక్షన్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ చాలా అలర్ట్‌గా ఉండాలన్నారు. జిల్లాలో ఓటర్ గుర్తింపు కార్డుల పంపిణీ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. హోమ్ ఓటింగ్ కార్యక్రమంలో ఎటువంటి సమస్యలు లేకుండా కేటాయించిన అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈవీఎం స్ట్రాంగ్ రూముల దగ్గర విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మే 11వ తేదీ సాయంత్రం 6 నుంచి ఎన్నికల ప్రచారం ముగుస్తుందని, 11వ తేదీ తర్వాత ఎటువంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ ఎంసీసీ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కుల, మత, ప్రాంతీయ పరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయ నేతలు ప్రసంగించడం, మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయడం, పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకురావడం, తిరిగి తీసుకువెళ్లడం అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం వంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది 24/7 గంటల విధులు నిర్వహించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. వాహనాలు తనిఖీ చేసే సమయంలో తప్పనిసరిగా వీడియో కవరేజ్ చేసి డబ్బు, మద్యం, ఇతర ఆర్టికల్స్ సీజ్ చేసిన తరువాత వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేసి వాహనాలకు రసీదు ఇవ్వాలన్నారు. చెక్‌పోస్టుల్లో సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో సత్యనారాయణ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్



ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ నాగేంద్ర

పుల్లంపేట, మే 1: మండల పరిధిలోని రామసముద్రం పంచాయతీలో బుధవారం వైసీపీ నాయకుల ఎన్నికల ప్రచారంలో ఆ పంచాయతీలో పనిచేసే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ తలూరు నాగేంద్ర పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఉపాధి సిబ్బంది పాల్గొనకూడదని అధికారులు ఆదేశాలు ఇస్తున్నా ఫిల్డ్ అసిస్టెంట్ నాగేంద్ర మాత్రం రామసముద్రంలో జరిగిన ప్రచారంలో వైసీపీ నాయకులతో పాటు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు.

సంపద సృష్టించే నేత చంద్రబాబు

● టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి

చిట్వేలి, మే 1: సంపదను సృష్టించే అభివృద్ధి చేసే నాయకుడు చంద్ర బాబు నాయుడు అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపా నందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నా యుడు అన్నారు. బుధవారం మండలంలోని నక్కలపల్లి పంచాయతీ సర్పంచ్ మద్దిన చంద్రమోహన్ నాయుడు ఆధ్వర్యంలో నక్కలపల్లె, కస్తూరివారి పల్లి, జోరోపల్లి, గొల్లపల్లిలో మండల అధ్యక్షుడు కే.కే.చౌదరి ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి, చిన్న కోడలు శిరీష, అభ్యర్థి అరవ శ్రీధర్ ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్లాసు, కమలం గుర్తు లకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముందు గా నక్కలపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ నాయకులు రామాంజనేయులు, లారీ సుబ్బరాయుడు, గుత్తి నర సింహ, నానబాల నాగార్జున, మాదాసు నరసింహ, కాకర్ల నాగార్జున, లాయర్ బాలాజీ, వేణుగోపాల్ రెడ్డి, చంగల్ రాయుడు, బాలకృష్ణ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్ రాజు, శివ రాజు, బీజేపీ నాయకులు బాబూజీ, అద్భుత కుమార్, కిశోర్, కంచర్ల సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముక్కా కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న గ్రామస్తులు

కోడూరు అభివృద్ధి కోసం జనసేనకు ఓటు వేయండి

రైల్వేకోడూరు(రూరల్): కోడూరు అభివృద్ధి కోసం జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు ఓటు వేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు కోరారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్, పగడాలపల్లె, చిట్వేల్ రోడ్డు ప్రాంతాల్లో బుధవారం జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వైసీపీ అభ్యర్థి చేసిన అభివృద్ధి ఏంటని ప్రతి ఒక్కరు ప్రశ్నించుకోవాలని కోరారు. అరవ శ్రీధర్‌కు ఒక అవకాశం ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, కోడూరు మాజీ సర్పంచ్ మురళీధర్‌గౌడ్, తిప్పన కృష్ణయ్య, ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, వరికూటి నాగరాజు, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా, షేక్ జుబేర్, మస్తాన్, టీడీపీ ఎస్సీ నాయకులు పుల్లల రమేష్, తిప్పన రాజశేఖర్, మహిళ నాయకురాలు మెహతాజ్ పాల్గొన్నారు.

చిట్వేలి: తిమ్మయ్యగారిపల్లె పంచాయతీలో ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ తదితరులకు తిమ్మయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ రాటకొండ సుబ్బరాయుడు, కటారు రవీంద్రనాయుడు, రాటకొండ వెంకటయ్య, ఓ.శ్రీని వాసులు, సింగన హరి, వేణుగోపాల్, నరసింహ నాయుడు, గ్రామస్తులుఘనంగా స్వాగతం పలి కారు. గ్రామంలోని అంజనేయస్వామి రామాలయం లో పూజలు చేసి ఇంటింటా ప్రచారం నిర్వహించా రు. గాజు గ్లాసు, కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కే.కే.చౌదరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్‌రాజు, గుండయ్య యాదవ్, కట్ట లోకేష్, పెద్దురు రాజా, ప్రవీణ్, నవీన్, కోటి, చందు, వెంకటేష్, రాజు, తిమ్మయ్యగారిపల్లి పంచాయతీ ప్రజలు కూటమీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధీలోని కొత్తపేట పంచాయతీ జీవన్‌నగర్, చెన్నయ్యగారిపల్లె, బలిజపల్లె, గ్రామంలో బుధవారంజనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ తరఫున నిర్వహించిన ప్రచారానికి విశేష స్పందన లభించింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి కోడలు శిరీషకు జనం అడుగడుగునా నీరాజనాలు పలికారు.ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేసి అరవ శ్రీధర్‌ను, కమలం గుర్తుకు ఓటు వేసి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడిని అత్యధిక మెజారిటీతో గెలింపించాలని కోరారు. కూటమి అభ్యర్థుల తరఫున శిరీష చేస్తున్న ప్రచారంలో మహిళలు పెద్ద ఎత్తున్న స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు, మాజీ సర్పంచ్ క్రిష్ణమ నాయుడు, పార్లమెంట్ కార్యదర్శి లింగుట్ల వెంకటరమణ, విజయ్‌కుమార్ చౌదరి, చిన్నం శివయ్య, ఈశ్వర్ నాయుడు, కేశినేని నాయుడు, పద్మాకర్‌రెడ్డి, కాకర్ల భాస్కర్‌నాయుడు, పాల్గొన్నారు.



అంజనేయస్వామికి పూజలు చేస్తున్న నేతలు



ప్రచారంలో ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు, ఎన్డీఏ నాయకులు



కొత్తపేటలో ప్రచారం చేస్తున్న ముక్కా శిరీష, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు



ప్రచారంలో పాల్గొన్న జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, టీడీపీ మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు తదితరులు

పది కుటుంబాలు జనసేనలో చేరిక



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లె, మే 1: మండలంలోని మంగంపేట ఆర్‌ఆర్-3 (అయ్యపురెడ్డిపల్లె)లో బుధవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి , పెద్ద కోడలు రిషిక రెడ్డి, చిన్న కోడలు శిరీష ప్రచారం నిర్వహించారు. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కల్లా చలపతి, చంద్రమోహన్, మండల మాజీ ఉపాధ్యక్షుడు గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్ ఆధ్వర్యంలో వైసీపీకు చెందిన పది కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ముక్కా వరలక్ష్మి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓటు వేసీ ఉమ్మడి కూటమీ అభ్యర్థి శ్రీధర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన రాయలసీమ కార్యదర్శి జోగినేని మణి, టీడీపీ సీనియర్ నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, గజేంద్ర నాయుడు, ఓరుగుంట ధర్మతేజ, నిఖిల్ మరియు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే కాపుల అభివృద్ధి



మీడియా సమావేశం లో మాట్లాడుతున్న కాపు నాయకులు

రైల్వేకోడూరు, మే 1: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కాపుల సంక్షేమం సాధ్యమైందని రాష్ట్ర కాపు నాయకులు కల్లా చలపతి, అనుములగుండం చంద్రమోహన్, గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరులో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కాపులు కూటమికి మద్దతు ఇస్తున్నారన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో కాపులతోపాటు, కమ్మ, రెడ్డి, బీసీలు, మైనార్టీలు, క్షత్రియులు, దళిత, గిరిజన తదితర ప్రజలు కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తున్నారన్నారు. కాపులందరూ ఐక్యంగా ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రచారం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రజల కష్టాలు తెలుసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తారన్నారు. వైసీపీ హయాంలో జరిగిన ఇసుక దందా, భూ మాఫియా, దాడులు, మహిళల కిడ్నాప్‌లు, దౌర్జన్యాలు తదితర అంశాలపై ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం తథ్యమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత పొన్నాటి వాసుదేవరెడ్డి, మంగంపేట నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడుదాం

రాయచోటిటౌన్, మే1: కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం మేడే సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం ప్రతిన భూని భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాదుల ఉచ్చు నుండి భారతదేశాన్ని కాపాడుకోవాలంటే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలే నాంది కావాలన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చికాగో పోరాట స్ఫూర్తితో ముందడుగు వేద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మున్సి ఎల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నేలపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద వారు కార్మిక జెండాను ఆవిష్కరిం చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా నాయకులు చెన్నయ్య, రాంబాబు, పట్టణ లీడర్లు భాగ్యలక్ష్మి, బంగారుపాప, ఖాజాబీ, విజయమ్మ, నాగమణి, అరుణ, సుమలత, మాధవయ్య, రెడ్డెయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, కేవీపీఎస్ వెంకటయ్య, అంగన్వాడీ, ఆశా, మున్సిపల్, విద్యుత్, గ్రామ పంచాయతీ, గ్రీన్‌అంబాసిడర్స్, వీఆర్‌ఏలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్, పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ఏఐటీయూసీ అనుబంధ ఏపీఎండీసీ ఎంప్లాయీస్ యూనియన్, మంగంపేట త్రివేణీ ప్రైవేటు మైనింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ తుమ్మల రాధాకృష్ణ, ఎం.గంగాధర్, పోకూరు మురళి ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికల బలిదానాలతో సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మునిశేఖర్, వడ్డి లక్ష్మీనారాయణ, జి.దినేష్, నాయకులు కలిశెట్టి నాగరాజు, వెంకటరమణ, సుబ్రమణ్యం, సిద్దేశ్వర, మణికంఠ, మనోజ్, పి.సురేష్, భాను ప్రకాష్, పార్ల కిషోర్, సాయి సుబ్రమణ్యం, బాలసుబ్రమణ్యం, సలీం, మహబూబ్‌బాషా, నాదారవల్లి పాల్గొన్నారు.

చిట్వేలి : మేడే సందర్భంగా బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఆఫీసు, మ్యాక్సీ స్టాండ్, బస్టాండు, ఆటో స్టాండులో సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు నాని, సుజాత అధ్యక్షతన చిట్వేలి ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, గ్రామసేవకుల సంఘం డివిజన్ అధ్యక్షులు సుధాకర్, సిద్దు, మల్లికార్జున, చిన్న మనోహర్, సాదక్, రమణ, దుర్గయ్య, అంగన్‌వాడీ వర్కర్లు, యూనియన్ నాయకురాలు సుధామని, శ్రీదేవి, శాంత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మున్సిపల్ఎలక్ట్రిసిటీ, ఆటో యూనియన్ నాయకులు కలిపి రాజంపేట పట్టణంలోని ఏడు కేంద్రాల్లో ఎర్ర జెండాలను ఎగుర వేశారు. ఏఐటీయూసీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక గోదాము వద్ద ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఎర్రజెండా ఎగుర వేశారు. కార్మికులు షఫీ, దర్బార్, వెంకటేసు, ముబారక్, ఆరీఫ్, కిషాద్ తదితరులు పాల్గొన్నారు

సంబేపల్లె: సంబేపల్లె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం మొదట అంగన్వాడీ కార్యకర్తలు మేడే వేడుకలు నిర్వహించారు. మండలంలోని నాలుగు సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : పెనగలూరులో ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈరి సుబ్బరాయుడు అధ్యక్షతన ఏఐటీయూసీ, ఆటో వర్కర్స్ నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్మికులు సి.హరిప్రసాద్, శ్రీనివాసులు, కార్తీక్, కె.హరి, కె.నవీన్, ఎల్.విష్ణువర్ధన్, కె.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ రెడ్డెప్ప సేవలు అభినందనీయం

రాయచోటిటౌన్, మే1: అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ బుధవారం పదవీ విరమణ పొందిన రెడ్డెప్ప సేవలు అభినందనీయమని అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఎస్ఐ రెడ్డెప్పను సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేయడంలో ప్రజలకు దగ్గరగా ఉండేది ఒక పోలీస్ ఉద్యోగం మాత్రమేనన్నారు. పదవీ విమరణ తరువాత కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడుపుతారని ఆశిస్తున్నామన్నారు. పదవీ విరమణ పొందిన తరువాత సమస్యలు ఎదురైతే డిపార్టుమెంట్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ఆర్ఐ (అడ్మిన్), శ్రీనివాసులు, ఎంటీవో ఆర్ఐ పెద్దయ్య, ఆర్ఎస్ఐ సోమ శేఖర్, ఏఆర్ఎస్ఐ పళని, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేం చూశాం.. మేమున్నాం...

● మండు వేసవిలో ప్రజల సమస్యలపై మండిపల్లి కుటుంబ సభ్యులు

సంబేపల్లె, మే1: గ్రామాల్లో వేసవిలో ప్రజలు పడుతున్న బాధలను చూశాం. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి అని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత, సోదరీమణులు శ్రీలత, శ్రీవిద్య, మరదలు సౌమ్యరెడ్డి ప్రజలకు తెలియజేశారు. బుధవారం పెద్దజంగపల్లె, పెద్దకోడివాండ్లపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, కొత్రాళ్ల హరిజనవాడ, వడ్లపల్లి, అంకంవాండ్లపల్లె, పొట్టిరెడ్డిగారిపల్లె, ఊరిగాయగుట్ట హరిజనవాడ, నాయకువారిపల్లెలో స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. . ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, టీడీపీ నాయకులు మద్దిరెడ్డి, రమేశ్‌రెడ్డి, హరినాథరెడ్డి, కోటిరెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, ఖాదర్‌బాషా, టీడీపీ మండలాఖ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్, ప్రచార కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, రాజారెడ్డి, గ్రామ సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ మౌనిక, చిన్నవీరాస్వామి, ఎస్సీ సంఘం నాయకుడు చిన్నప్ప, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సహదేవ, శివప్రసాద్, వర్తి రెడ్డెన్న, బాలకృష్ణారెడ్డి, ఆంజనేయులు, నాగేశ్వర, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



రాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలంటూ అభ్యర్థిస్తున్న హరిత

సైకిల్‌కు ఓటేయండి.. అభివృద్ధిలో భాగస్వాములు కండి

రామాపురం: సైకిల్ గుర్తుకు ఓటు వేయండి అభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కస్పా, కొత్తపల్లె, రాచపల్లి పంచాయతీ బీదవాండ్లపల్లెల్లో బుధవారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. . ఈ సందర్భంగా నల్లగుట్టపల్లె జమ్ముగుంటలో ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కూలీలను అడిగారు. అనంతరం కొత్తపల్లి, నల్లగుట్టపల్లె కస్పాలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిరేవుల రవికుమార్‌రెడ్డి, చిలేకాంపల్లె శివారెడ్డి, ఆంజనేయరెడ్డి, గడికోట అంజనేయరెడ్డి, మద్దిరేవుల జగన్‌మోహన్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సూరం రాజశేఖర్‌రెడ్డి, సూరం శివారెడ్డి, దేరంగుల శ్రీనివాసులు, దేరంగుల శంకరయ్య, రమణయాదవ్, నెర్సుపల్లె సహదేవరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి, సహదేవరెడ్డి, వెంకటసుబ్బయ్య, గోవిందరెడ్డి, రామకృష్ణగౌడ్, గంపా సుబ్బరాయుడు తదితరులు



మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

మంచాలమ్మ జాతర కరపత్రాలవిడుదల

రాయచోటిటౌన్: మంచాలమ్మ జాతర కరపత్రాలను బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విడుదల చేశారు. మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, పొన్నెరాళ్లపల్లె రంగారెడ్డి, టీడీపీ నాయకులు సహదేవరెడ్డి, గొడిండ్ల ఆంజనేయులు, వడ్డెర సంఘం నాయకులు, ఇడగొట్టు నాగేశ్వరరావు, కుర్రపోతుల జీవానందం, పల్లపు బాలకృష్ణ, దేరంగుల రామాంజులు, కేవీపల్లె రమణ, చల్లా రెడ్డెయ్య, కడప వార్త ఎడిటర్, కడప జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు జీ. రమణయ్య తదితరులు పాల్గొన్నారు. రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రైవేట్ విద్యాసంస్థల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పీ. మదన్‌మోహన్‌రెడ్డి ప్రెద్దకాల్వపల్లె, ఎగువ అబ్బవరం, అబ్బవాండ్లపల్లె, మాలపల్లె, ముసల్‌రెడ్డిగారిపల్లెల్లోప్రచారం చేశారు. పోలు మేఘనాథ్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి, తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం అప్పకొండయ్యగారిపల్లెకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం రాయచోటి ఎస్ఎన్‌కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోమండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

టీడీపీలో చేరిక



రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన రెడ్డెయ్య ఆయన అనుచరులు

లక్కిరెడ్డిపల్లె మే 1: మండలంలోని బి యర్రగుడి, కోనంపేట గ్రామాలకు చెందిన దండె శ్రీనివాసులు, నారాయణ, సుబ్బారెడ్డి, వెంకటరమణ తదితరులు బుధవారం యర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గతంలో రమేష్‌కుమార్ రెడ్డి వర్గంలో ఉన్న వీరు.. ఆయన వైసీపీలో చేరడంతో, బుధవారం మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు ఈ సంద ర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయడును ముఖ్య మంత్రి చేస్తే వైసీపీ మూకల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.

రామాపురం,: మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గ్రామ సర్పంచ్ తమ్ముడు కాంపల్లెకు చెందిన ముంగర రెడ్డెయ్య ఆయన అనుచరులు బుధవారం రాయచోటి టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలోకి చేరినట్లు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.గత ఐదేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధి కుంటుపడిందని, తాగునీటి సమస్య పెరిగిపోయిందని పంచాయతీల్లో నిరుద్యోగ యువత పెరిగారని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ ముఖ్య నాయకులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మండిపల్లికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మదన్‌మోహన్‌రెడ్డి

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

లక్కిరెడ్డిపల్లె మే 1: ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఏప్రిల్ 21న పరీక్ష నిర్వహించగా 140 మంది హాజరయ్యారు. పలితాల జాబితాను ఏపీ మోడల్‌లో స్కూల్ నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్నారు. మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

రాయచోటి(కలెక్టరేట్), మే1: ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని నిరుద్యోగ యువత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం పోర్టల్‌ను వినియోగించుకోవాలన్నారు. పదవ తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ పోర్టల్ మొబైల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులు మెయిల్ ద్వా రా జాబ్ మేళా వివరాలు, ఉద్యోగ అవకాశాలు తెలుసుకోవచ్చునన్నారు.

నిరుపేద చిన్నారులకు ఉచితంగా ఖత్నా

గాలివీడు, మే1: గాలివీడు అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో 3న శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాలివీడు మండల పరిసర ప్రాంతాల్లో ఉండే నిరుపేద ముస్లిం పిల్లలకు పెద్దూరులోని జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్ ఆవరణలో ఉచితంగా వడుగులు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మిగతా వివరాలకు ఫోన్ నెంబర్లు 9398585839, 9705917515లను సంప్రదించాలని తెలిపారు.

చంద్రబాబు పర్యటనను

విజయవంతం చేయాలి

గాలివీడు, మే1: నేడు రాయచోటి పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి విచ్చేయనున్న మాజీ ముఖ్యమంత్రి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి,సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మండల మండల తెలుగుయువత నాయకుడు మదన్ మోహన్ తెలిపారు. వారు బుధవారం గాలివీడు లక్కిరెడ్డిపల్లె టీడీపీ కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడుతూ గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చంద్రబాబు పర్యటనలో పాల్గొనాలన్నారు. మధ్యా హ్నం రెండు గంటలకు చంద్రబాబు రాయచోటికి రానున్నారని తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయదుందుభి మోగిస్తుందని ప్రతి కార్యకర్త పార్టీ విజయానికి కృషి చేయాలని వారు కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఓబులవారిపల్లె, మే1 : మండలంలోని జాతీయ హైవే రోడ్డు బొమ్మవరం క్రాస్ రోడ్డు దగ్గర బుధవారం ఉదయం చెన్నై నుంచి హైదరాబాదుకు వెళుతున్న ట్రక్కు అదుపు తప్పి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకు నుజ్జునుజ్జు కాగా, వాహనచోదకుడు శివ సమయస్ఫూర్తితో పక్కకు దూకడంతో అతనికి ప్రమాదం తప్పింది. .



నెల్లూరులో యువగళం కార్యక్రమంలో నారా లోకేశ్‌తో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్

ఆకట్టుకున్న దుర్యోధన వధ

చిన్నమండెం, మే1: మండలంలోని కేశాపురం గ్రామపంచాయతీ రెడ్డివారిపల్లె వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో బుధవారం దుర్యోధడి వధ కార్యక్రమం కన్నుల పండువగా సాగిందని నిర్వాహకులు తెలిపారు. అన్న దానం, అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం 6 గంటలకు ధర్మరాజు పట్టాభిషేకం జరుగుతుంది.

కదిలిన కూటమి నేతలు

● నియోజకవర్గంలో ప్రచార జోష్

రాజంపేట, మే 1: రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో టీడీపీ ప్రచారం ఊపందుకుంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలని కోరుతూ రాజంపేట మండలంలోని ఆరు మండలాల్లో సుమారు వెయ్యి గ్రామాల్లో ప్రచారం సాగుతోంది. మూడు రోజుల్లో టీడీపీ ప్రచారం జోష్ పెంచేసింది. రాజంపేట పట్టణంలోని 29 వార్డుల్లో కూడా ఇదే జోష్ కనిపిస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమన్వయంతో ప్రచారంలో పాల్గొంటున్నారు. రాజంపేట ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట పట్టణంలోని ఉస్మాన్ నగర్, రూరల్ ప్రాంతంలోని బోయనపల్లె ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఉస్మాన్ నగర్ ప్రాంతంలో మైనారిటీ నాయకులు గుల్జార్‌బాషా, అబూబకర్ తదితరుల ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. బోయనపల్లెలో చేనేత కార్మికులతో కలిసి ఆ గ్రామ పెద్దలు, టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల కష్టనష్టాలపై సుగవాసి ఆరా తీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రతిభావంతులకు సత్కారం

పట్టణంలో పలు రంగాలకు చెందిన ప్రతిభావంతులకు టీడీపీ అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యం సత్కరించారు. రాజంపేట పట్టణంలోని నవీన్‌చంద్ర కల్యాణ మండపంలో ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దగ్గుపాటి నవీన్, డాక్టర్ గాయత్రి దంపతులు తమ నవీన్ చంద్ర దంతవైద్యశాల 20వ వార్షికోత్సవ సందర్భంగా రాజంపేట పట్టణంలోని ప్రముఖ వైద్యులు, దంత వైద్యులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, న్యాయవాదులు, పురప్రముఖులకు ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమానికి సుగవాసి బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్ చంద్ర కల్యాణ మండప అధినేత దగ్గుపాటి చంద్రశేఖర్‌బాబు దంపతులను, డాక్టర్లు సుబ్బారెడ్డి, డాక్టర్ చెన్నూరు సుధాకర్, విజయ్‌కుమార్, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు మాలేపాటి రామకృష్ణనాయుడుతో పాటు పట్టణంలోని పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ డాక్టర్లు ప్రత్యక్ష దైవాలని, దంత వైద్యులు దగ్గుపాటి నవీన్, వారి శ్రీమతి గాయత్రి నవీన్ చంద్ర దంత వైద్యశాల 20వ వార్షికోత్సవ సందర్భంగా పట్టణంలోని పురప్రముఖులను సత్కరించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. మీ అందరి మనోభావాలకు అనుగుణంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయడానికి చంద్రబాబునాయుడు ఒప్పించి తాను తొలి విజయం సాధించానన్నారు. కావున తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సింగంశెట్టి రవీంద్ర, నాగా సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపు జేఏసీ నేతల సంపూర్ణ మద్దతు

రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు రాష్ట్ర కాపు జేఏసీ నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు సుగవాసి బాలసుబ్రమణ్యంను కలిసి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. కాపు జేఏసీ కన్వీనర్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వాసురెడ్డి ఏసుదాసు, కాపు జేఏసీ కన్వీనర్ ఆరేటి ప్రకాష్, చిత్తూరు జిల్లా కన్వీనర్ రామ్మూర్తి, కాపు జిల్లా సంక్షేమ సంఘం నాయకులు జిలకర మధు, రాజంపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, సుదర్శన్ థియేటర్ ఎండీ అదృష్టదీపుడు తదితరులు మాట్లాడుతూ రాజంపేటలో సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపునకు ప్రతి కాపునేత, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



రాజంపేట పట్టణం ఉస్మాన్ నగర్‌లో ముస్లిం నేతలతో ప్రచారం నిర్వహిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రచారాలు

రాజంపేట పట్టణంలోని పలు వార్డుల్లో టీడీపీ నేతలు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బలిజపల్లెలో టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంపై సైకిల్ గుర్తుపై, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సన్నపనేని బాలాజీ, రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం, తోట నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఎర్రబల్లిలో కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. సాయినగర్‌లో కౌన్సిలర్ శ్వేతారెడ్డి, ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మహిళా నేత ఉదయగిరి సౌందర్యలహరి, రవి తదితరులు పాల్గొన్నారు.

మందరం రాచపల్లెలో బీజేపీ నేతల ప్రచారం

రాజంపేట మండలం మందరం రాచపల్లెలో బీజేపీ నేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర బీజేపీ కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంటర మేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని, రాజంపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యంలను అత్యధిక మెజారిటీలతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



వీరబల్లిలో ప్రసాద్‌బాబుకు హారతులు పడుతున్న మహిళలు

గుల్జార్ అంటే గడగడ...

రాజంపేటలో సీనియర్ మైనార్టీ నాయకుడు గుల్జార్ బాషా అంటే ఎన్నికల సమయంలో గడగడలాడిపోతారు.. అతను అటు టీడీపీలోనూ, ఇటు వైసీపీలోనూ కొనసాగి ఇటీవలే తిరిగి టీడీపీలో చేరారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొనసాగుతూ రాజీనామా చేశారు. తన ఆధ్వర్యంలో పెద్దఎత్తున ముస్లింలను టీడీపీలో చేర్పించి, ప్రచారం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలను ముప్పుతిప్పలు పెడుతూ, శాపనార్థాలు పెట్టడం గుల్జార్‌కు వెన్నతో పెట్టిన విద్య.. ఈయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ తరపున ఎంత గట్టిగా అయినా వాదిస్తాడు.. టీడీపీలో చేరి రాజంపేటను సర్వనాశనం చేసిన వైసీపీ నాయకుల ఓటమిని కళ్ల చూసేంత వరకు నిద్రపోనంటూ శపథం చేశాడు. ముస్లింలకు జగన్ గుండుసున్నా చుట్టారని తూర్పారబట్టారు. రాజంపేటను జిల్లా చేస్తామన్న టీడీపీకే తమ మద్దతు అంటూ జెండా చేతపట్టి ప్రచారాలకు శ్రీకారం చుట్టారు.

నందలూరు: బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కమలం గుర్తుకు, ఎమ్మెల్యే సుగవాసి బాలసుబ్రమణ్యం సైకిల్‌గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కూటమి నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. బుధవారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని కాపువీధి, వీరబ్రహ్మంగారి గుడి వీధి మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో డోర్ టు డోర్ ప్రచారంలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం చేశారు. ప్రచారంలో టీడీపీ నాయకులు సుగవాసి సుధాకర్, బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, మాజీ జెడ్పీటీసీ యల్లటూరి శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, కూటమి నాయకులు ఆకుల చలపతి, హేమలత, తోట శివశంకర్, మురళి, ప్రశాంత్ పార్టీ తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం

టీడీపీ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం టీడీపీ మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, టీడీపీ నాయకులు తాటి సుబ్బరాయుడు, జంగంశెట్టి సుబ్రమణ్యం, నారపశెట్టి శివయ్య, మున్వర్‌బాషా, గంధం గంగాధర్, మట్టి బాబు, పామూరు వెంకటేష్, తుమ్మాది శివ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ల్యాండ్‌టైటిల్ ఆక్ట్ రైతులకు ఉరితాడు లాంటిదని మాజీ మంత్రి సి.రామచంద్రయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని దర్శిపల్లి, దువ్వంతరంపల్లి గొల్లపల్లి, నరసన్నగారి పల్లె, కొండమాచుపల్లెల్లో టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నరసన్నగారిపల్లె గ్రామంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్‌తో కలిసి రామచంద్రయ్య ప్రచారం చేశారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని, యువత టీడీపీకి మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా వీరికి టీడీపీ నాయకులు పూలమాలతో సత్కరించి ఘనంగా గ్రామంలో ఆహ్వానించారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలు టీడీపీ పార్టీకి అండగా ఉండాలని చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, సంపద సృష్టించే నాయకుడని కొనియాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, గజ్జల నరసింహారెడ్డి, రమణ, ఈశ్వరయ్య, అడ్వకేటు రామదాసు, కట్టా నారాయణ, కుప్పాల వెంకటసుబ్బయ్య, డాక్టర్ శివ, బొబ్బిలి రాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాబుసుభాన్, నరసింహులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దవటం: సంక్షేమ పథకాలు ఆగిపోతాయంటూ తప్పుడు ప్రచారం మానుకోవాలని జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ సూచించారు. బుధవారం ఆయన సిద్దవటం మండలం మీదుగా తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలో మీడియాతో మాట్లాడారు. ఎన్‌డీఏ ప్రకటించిన మేనిఫెస్టో చూసి వైసీపీ నేతలకు వణుకు పుట్టిందని, దాంతో తప్పుడు ప్రచారాలు చేస్తూ ఓటర్లను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి గడ్డుకాలం దగ్గరపడిందని ఆయన అన్నారు.

వీరబల్లి: సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తాటికుంటపల్లి పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు తన అన్న సుగవాసి బాలసుబ్రమణ్యం తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త, ప్రతి అభిమాని కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు బాను గోపాల్‌రాజు, సీనియర్ నాయకులు రెడ్డప్ప రెడ్డి, సురేందర్ రెడ్డి, ఆంజనేయులురెడ్డి, భాస్కర్‌రాజు, దుర్గం ఆంజనేయులు, పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సుండుపల్లె: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలకు మద్దతుగా బుధవారం మండలంలోని చిన్న గొల్లపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ప్రసాద్‌బాబు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుం దన్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనుకబడిందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యంను గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. సుండుపల్లి మండల ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రెడ్డప్ప, శివప్రసాద్‌నాయుడు, రమేష్‌నాయుడు, వెంకటేశ్వర్‌నాయుడు, యూనియన్ బాషా, ప్రతాప్‌రెడ్డి, ఎర్రంరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణ, బీజేపీ జిల్లా నాయకులు వెంకటరామరాజు, జనసేన నాయకులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నగొల్లపల్లి గొంతెండుతోంది

●ఎన్నికల ప్రచారంలో మహిళల రోదన
● స్పందించిన సుగవాసి ప్రసాద్‌బాబు



చిన్నగొల్లపల్లిలో సుగవాసి ప్రసాద్‌బాబుకు సమస్య చెప్పుకుంటున్న గ్రామస్తులు

సుండుపల్లె, మే 1: గొంతెండుతోంది.. గుక్కెడు తాగునీరు ఇప్పించండంటూ చిన్నగొల్లపల్లికి చెందిన మహిళలు బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గ్రామానికి వచ్చిన ఆయనతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడంతో నమ్మకంతో ఓట్లు వేశాం. గెలిచిన తర్వాత వైసీపీ నాయకులు మమ్మల్ని పట్టించుకోలేదు. అయినా మేము ఏనాడూ ఎవరిని విమర్శించలేదు. ప్రశ్నించలేదు. ప్రస్తుతం గుక్కెడు తాగునీటి కోసం దేబిరించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి దాపురించింది. తాగునీరందించి మీరైనా పుణ్యం కట్టుకోండని వారు విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన గురువారం నుంచి ప్రతిరోజు ఇంటింటికి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని 227 పల్లెలకు తాగునీటిని అందించాలన్న సంకల్పంతో టీడీపీ హయాంలో రోళ్లమడుగు ప్రాజెక్టు పనులు 60 శాతం పూర్తి చేశాం. టీడీపీ హయాంలో ప్రారంభించారన్న ఉద్దేశంతో వైసీపీ పాలకులు పథకాన్ని ఆపేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే నీటి పథకం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ రాజంపేట టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన సోదరుడు బాలసుబ్రమణ్యంను సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తమ కుటుంబం సుండుపల్లె మండల ప్రజలకు ఎంతో రుణపడి ఉందన్నారు. గతంలో తమ తండ్రి పాలకొండ్రాయుడును ఎలా ఆదరించారో అదే విధంగా బాలసుబ్రమణ్యం ఆదరించాలని కోరారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తమకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించారు ఆశీర్వదించండి అని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, పాల ఏకిరి సంఘం రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్‌నాయుడు, చప్పిడి రమేశ్‌నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, యర్రంరెడ్డి, రామాంజులు, ప్రతాప్‌రెడ్డి, యూనియన్ బాషా, అమర్‌నాథరెడ్డి, చంద్రశేఖర్‌రాజు, బీజేపీ జిల్లా నాయకులు వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.







రాజంపేటలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్న కాపు జేఏసీ నేతలు, రాజంపేటలోని మందరం రాచపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, ఒంటిమిట్టలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న రామచంద్రయ్య, హరిప్రసాద్

నిందితుడికి 6 నెలల జైలు శిక్ష

మైలవరం, మే 1: ద్విచక్ర వాహనంలో వేగంగా వెళ్తూ ఓ వ్యక్తిని ఢీకొన్న ఘటనలో నార్జాంపల్లికి చెందిన అన్నెబోయిన ఉపేంద్ర అనే యువకుడికి 6 నెలల జైలు శిక్ష విధించినట్లు బుధవారం జమ్మలమడుగు కోర్టు జడ్జి తీర్పు వెల్లడించినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డిసురేష్ తెలిపారు. 2018 సంవత్సరంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కోర్టు తీర్పు వెల్లడించింది. ద్విచక్ర వాహనంలో నార్జాంపల్లి చెందిన అన్నెబోయిన ఉపేంద్ర అనే యువకుడు వేగంగా వెళ్తూ దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన నీలూరు కుమ్మరి దశరథకుమార్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో దశరథకుమార్ మృతి చెందడంతో మైలవరం పోలీస్ స్టేషన్లో 2018లో కేసు నమోదైంది.

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

● 13 తులాల బంగారు అపహరణ

కడప (క్రైం), మే 1: కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు పడి 13 తులాల బంగారు నగలను అపహరించినట్లు వన్‌టౌన్ సీఐ రంగస్వామి తెలిపారు. సీఐ వివరాల మేరకు... హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న సరోజారెడ్డి గత నెల 27న తమ కుటుంబ సభ్యులతో లక్కిరెడ్డిపల్లెకు వెళ్లి తిరిగి బుధ వారం ఇంటికొచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండ టంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 13 తులాల బంగారు చోరీ అయినట్లు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మృతి కేసులో ముగ్గురు అరెస్టు

కడప (క్రైం), మే 1: కడప నగరం సాగర్ కాలనీలో గత నెల 22న ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆ వివాహిత భర్త, అత్తమామలను బుధవారం పాత బైపాస్ వద్ద అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ రామచంద్ర తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కర్నూలుకు చెందిన లతిక మృతికి కారకులైన ఆమె భర్త సాయికుమార్, అత్తామామ పద్మ, లింగన్నలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

కడప(కలెక్టరేట్), మే 1: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని కేటాయించే రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సజావుగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవా రం కలెక్టరేట్‌లోని ఎస్ఐసీ హాలులో ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె పర్యవేక్షణలో జేసీ గణేష్ కుమార్, నగరపాలక కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన నిర్దేశిత సమయంలో పకడ్బందీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టామన్నారు. ముందుగా పార్లమెంటరీ నియోజకవర్గం, అనంతరం 7 అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్‌స్టేషన్ల వారీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. ఎన్నికల యంత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని, సెక్యూరిటీ, ప్రోటోకాల్ ప్రకారం పటిష్ఠ పోలీసు బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు యంత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి ఇంటిపై దాడి

రాయచోటి, మే 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట పట్టణంలో నివాసం ఉంటున్న జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ ఇంటిపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇంటికి వెనుకవైపు ఉన్న కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. కిటికీలకు అమర్చిన మెష్‌ను పీకి పక్కన పడేశారు. ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన ఇన్నోవా కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన బుధవారం ఉదయం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై జడ్జి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. ఇటీవల వైసీపీ నాయకులపై తాను క్రిమినల్ కేసు పెట్టానని, తనను భయపెట్టి కేసులను ఉపసంహరింపజేసేందుకు వారు గూండాలను ఇంటిపై పంపించారని అన్నారు. పదేళ్లుగా తనకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మధ్య అనేక సంఘటనలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మరోసారి దాడి జరిగిందన్నారు. దుండగులు కిటికీల అద్దాలు పగులగొట్టి యాసిడ్‌ను లోపలికి చల్లేందుకు ప్రయత్నించారని, తనతో పాటు, కుటుంబసభ్యులను హతమార్చేందుకు ప్రయత్నం జరిగిందని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని అన్నారు. దుండగులు దాడికి యత్నిస్తున్న సమయంలో స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, దీంతో మదనపల్లె డీఎస్పీకి ఫోన్ చేయగా రాత్రి ఇద్దరు పోలీసులను పంపారన్నారు. బయటకు వచ్చి చూడగా తన కారు సైతం ధ్వంసం అయిందన్నారు. తమ ఇంటిపై ఎవరు దాడి చేయించారనే విషయంలో పోలీసులు స్పందించడం లేదని ఆరోపించారు. జగన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనను చాలా విధాలుగా వేధిస్తున్నారన్నారు. ఇటీవల తాను వైసీపీ నాయకులపై బి.కొత్తకోటలో ఓ క్రిమినల్ కేసు పెట్టానని, ఆ కేసును రిజిస్టర్ చేయకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. ఈ నేపథ్యంలో తన నివాసంపై దాడి జరిగిందని, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులకు తావులేదని, ప్రజాస్వామ్య వాదులందరూ ఇటువంటి అరాచక చర్యలు, దాడులను ఖండించాలన్నారు.

ఆస్తి తగాదాలతో తమ్ముడే దాడి చేశాడు
- సూర్యనారాయణ, బి.కొత్తకోట సీఐ

బి.కొత్తకోటలో జడ్జి రామకృష్ణ నివాసంపై దాడిచేసిన వ్యక్తి ఆయన తమ్ముడు రామచంద్ర. ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదు. అన్నదమ్ములిద్దరికీ ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీంతో రాత్రి రామచంద్ర కిటికీ అద్దాలు, కారు అద్దాలు ధ్వంసం చేశాడు. జడ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాము. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాము.

సొంతింటి కల కలేనా...?



నీళ్లు లేక ఆగిపోయిన ఇంటి నిర్మాణాలు

సమస్యల వలయంలో జగనన్న కాలనీలు ● నీళ్లు లేక ఆగిన నిర్మాణాలు
● లబ్ధిదారులే బోరు రిపేరు చేయించుకున్న వైనం
జగనన్న కాలనీలకు వసతులు నిల్ ● ఆగ్రహిస్తున్న లబ్ధిదారులు

జమ్మలమడుగు, మే1: 'రాష్ట్రంలో ప్రతి నిరుపేదకూ సొంత ఇంటి కల నెరవేరుస్తామని, అన్ని వసతులూ కలిగిన ప్రాంతాన్ని ఎంపికచేసి ఇంటి నిర్మాణాలు చేపడతామని' ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మోహన్ రెడ్డి ప్రతి సభలోనూ ఊదరగొట్టారు. దీన్ని నమ్మిన పేదలు గంపగుత్తగా ఓట్ల వర్షం కురిపించారు. అధికారం చేపట్టి సీఎం హోదాలో జగన్ సొంత ఇంటి కల నెరవేర్చేందుకు తమ అనుయాయులకే లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందించారు. దీంతో రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో జగనన్న లేఔట్లు తయారు చేశారు. స్థలాలు దొరక్క పోవడంతో కొందరు స్థానికుల స్థలాలను సైతం ప్రభుత్వమే కొనుగోలుచేసి వాటిని లేఔట్లుగా రూపొందించి పేదలకు పట్టణంలో అయితే ఒక్కొక్కరికి సెంటు, గ్రామాల్లో ఒకటిన్నర సెంటు స్థలం కేటాయించారు. ఇంత వరకుబాగున్నా ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు ప్రభుత్వమే ఇస్తుందని నమ్మబలికి మొదట మీసొమ్ముతో ఇంటి నిర్మాణం చేపడితే అంచెలంచెలుగా డబ్బు లబ్ధిదారుడి ఖాతాలో వేస్తామని ప్రకటించారు. నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవరుస్తామని ప్రగల్భాలు పలికిన జగనన్న చివరకు ఇంటి నిర్మాణం విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని పలువురు నిరుపేదలు వాపోతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు సైతం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా జగనన్న కాలనీలు సమస్యలవలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వివరాల్లోకెళితే...

నియోజకవర్గంలోని జగనన్న కాలనీలుగా లబ్ధిదారులకు లేఅవుట్లు ప్రకటించారు. అప్పటి నుంచి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇంటి నిర్మాణాల విషయంలో లబ్ధిదారులు ముందుకు రావడంలేదని కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు కాంట్రాక్టుల అవతారమెత్తి బేస్‌మెంట్‌ల వరకు కొన్ని నిర్మించి బిల్లులు తీసుకున్న తర్వాత కొన్నింటిని కట్టకుండా చేతులెత్తేసినట్లు విమర్శలున్నాయి. జమ్మలమడుగులో అంబవరం జగనన్న కాలనీలో బోలెడు సమస్యలున్నాయి. ఇంటి నిర్మాణానికి నీళ్లు లేవని దాదాపు 10 నెలల నుంచి అధికారులను అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని లబ్ధిదారుల ద్వారా తెలుస్తోంది. జమ్మలమడుగు జగనన్న కాలనీలో మొత్తం 2,247 గృహాలకు లేఅవుట్ ఉండగా మరికొన్ని పెంచుతూ దాదాపు 800 ఇళ్లకు లేఅవుట్లు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు ఏమూలకు చాలదని కొందరు అప్పు చేసి నిర్మించుకుంటుంటే ఫైనల్ బిల్లులే కాదు పాత బిల్లులు కూడా రావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.



గ్రావెల్ రోడ్లలో రాళ్లు తేలి పాదచారులకు సైతం ఇబ్బందికరంగా మారింది. నీళ్లలేక మినీ ట్యాంకులు ఎండిపోయాయి. జమ్మలమడుగు జగనన్న కాలనీలో గతంలో వేసిన బోర్లు సైతం నాశిరకమని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కాలనీలో మొదటి నుంచీ అధికార పార్టీ నేతలు ఎన్ని బోర్లు వేశారు, మరమ్మతులు ఎప్పుడెప్పుడు చేశారో తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణాలు ఆగిపోయి నీళ్ల అడిగితే పట్టించుకోకపోవడంతో పది నెలల కిందట తామంతా ఏకంగా మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి అధికారులను అడిగితే నిధులు లేవని, అప్పటి అధికారులు చేతులెత్తేశారని లబ్ధిదారులు వాపోతున్నారు. చివరకు 12 ఇళ్లకు సంబంధించిన వారంతా కాలనీలో చేరి సొంతంగా చందాలు వేసుకుని బోరు రిపేరు చేయించుకుని నీళ్లను వాడుకుంటున్నట్లు బాధితులు వివరించారు. జమ్మలమడుగు మండలం పొన్నతోట జగనన్న కాలనీలోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయి. రోడ్లు లేవు, కరెంటు సమస్యలు, నీరు, రోడ్ల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. బోర్లు మరమ్మతులు చేయక ఇబ్బంది పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు తెలిపారు. జమ్మలమడుగు పొన్నతోట కాలనీలో 436 గృహాలకు దాదాపు 10 మాత్రమే శ్లాబ్‌లెవెల్‌కు వచ్చాయని, మిగతావి పూర్తికాలేదని తెలిపారు. మైలవరం జగనన్న కాలనీలో 173 లేఅవుట్లకు ఒక్కటీ పూర్తికాలేదని తెలుస్తోంది. ఈ సమస్యలకు సంబంధించి జమ్మలమడుగు హౌసింగ్ ఏఈ ఓబులేసును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఫైనల్ బిల్లుల సమస్య ఉందని, లబ్ధిదారులకు నీళ్లు లేవని, మౌలిక వసతులు లేక నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయని, ప్రస్తుతం సుమారు పది నెలల నుంచి లబ్ధిదారులకు నీళ్లు అందలేదని ఆయన తెలిపారు. 12 మంది లబ్ధిదారులు చందాలు వేసుకుని బోరు రిపేరు చేయించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పెద్దముడియం మండలంలో హౌసింగ్ ఏఈ సుబ్బరాయుడు మాట్లాడుతూ పెద్దముడియం మండలంలో చిన్న చిన్న లేఅవుట్లు కావడంతో ఇబ్బంది లేదని, మొత్తం 304 గృహాలకు కొన్ని పూర్తయ్యాయని, ఫైనల్ బిల్లులు రావాల్సి ఉందన్నారు. మైలవరం హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ 173 లేఅవుట్లకు ఒక్కటి మాత్రమే శ్లాబ్ పడిందని, మిగతావి పూర్తికాలేదన్నారు. రోడ్లు గ్రావెల్ రోడ్లు మాత్రమే ఉన్నాయని, నీటి సరఫరా లేదని లబ్ధిదారులు వివరిస్తున్నారు.



జమ్మలమడుగు జగనన్న కాలనీలో రాళ్లు తేలిన గ్రావెల్ రోడ్డు



మైలవరం జగనన్న కాలనీలో ఆగిపోయిన నిర్మాణాలు



పొన్నతోట జగనన్న కాలనీలో ఆగిపోయిన నిర్మాణాలు

టిక్కెట్టు కోసం గలగలా.. రాక వెలవెల

కిటకిటలాడిన పార్టీ కార్యాలయాలు నేడు మూసివేత ● సర్కస్ కంపెనీల్లా నేతల ఎన్నికల కార్యాలయాలు

రాజంపేట, మే1: సార్వత్రిక ఎన్నికలు వచ్చాయంటే సర్కర్ కంపెనీల్లో రాజకీయ నేతల పార్టీ కార్యాలయాలు కూడా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తాయి. ఇవి ఆరు నెలల పాటు హడావుడి చేస్తాయి. అందరి దృష్టినీ ఆకర్షిస్తాయి. ఎటువంటి పరిస్థితుల్లోనూ టిక్కెట్ తమకే వస్తుందని ఆశించిన పలువురు నేతలు మొదటి నుంచీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని లక్షలు ఖర్చు పెడుతూ అవసరం ఉన్నా లేకున్నా ప్రతి ఒక్కరినీ కలుస్తూ అభిమానులు, కార్యకర్తలతో పార్టీ కార్యాలయాలు సందడితో నిండిపోయాయి. చివరకు ఆశించిన వారికి టికెట్లు రాకపోవడంతో పార్టీ కార్యాలయాలను మూసి వేసి నిర్వేదంతో మిగిలిపోయారు. మరికొందరు ఎవరికి టిక్కెట్ ఇచ్చినా వారి కోసం ప్రచారం చేయడం, తమ అనుయాయులను ప్రచారాలకు తిప్పడం కొసమెరుపైంది. వివరాల్లోకెళితే...

రాజంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయదలుచుకున్న వారు డజను మంది. ఈ డజను మంది అటు వైసీపీ, ఇటు టీడీపీ తరఫున ఎమ్మెల్యే టికెట్లను ఆశించారు. అతి చిన్నపట్టణమైన రాజంపేటలో 12 రాజకీయ పార్టీలు ఆరు నెలల పాటు దేదీప్యమానంగా వెలుగొందాయి. వారిలో ఇద్దరికి మాత్రమే టికెట్లు లభించడంతో మిగిలిన



వెలవెలబోతున్న మేడా భవన్

వారి కార్యాలయాలు మూతపడిపోయాయి. టీడీపీకి ఈసారి ఎక్కువ పోటీ నెలకొంది. టీడీపీ తరఫున పోటీ చేయదలుచుకున్న వారిలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, గంటా నరహరి, రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చిన్నాన్న కుమారుడు, ప్రస్తుత టీడీపీ నేత మేడా విజయశేఖర్‌రెడ్డి (పెదబాబు), జనసేన తరఫున ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ, యువనేతలు అతికారి కృష్ణ, అతికారి దినేష్, శ్రీనివాసరాజు, వైసీపీ తరఫున ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వీరబల్లికి చెందిన మదన్‌రెడ్డి టికెట్ల కోసం పోటీ పడ్డారు. వీరిలో అటు పార్లమెంటుకు, ఇటు అసెంబ్లీకి పోటీ చేయదలుచుకున్న గంటా నరహరి ఆరు నెలల కిందట రాజంపేటలో అట్టహాసంగా విలాసవంతమైన వసతులతో కూడిన భవనాన్ని లాన్‌తో విలాసవంతమైన పార్టీ కార్యాలయంగా రూపొందించారు. అక్కడే తన రాజకీయ కార్యకలాపాలను ఊహించని రీతిలో ఉధృతి చేశారు. తన కార్యాలయం ఎదుట పదుల కొద్దీ వాహనాలు, భారీ హంగామాతో కార్యకర్తలు, రోజుకో కార్యక్రమం ఈ ఆరు నెలలు మూడు పువ్వులు ఆరు కాయలుగా ఆయన రాజకీయ కార్యకలాపాలు సాగాయి. కాగా ఆయనకు ఏ టికెట్టు లభించకపోవడంతో అర్థంకాక పార్టీ కార్యాలయం నామమాత్రంగా తయారైంది. ఆరు నెలలు ఆర్భాటంగా వెలిగిన ఈ గంటా కార్యాలయం నేడు గంట మోగించేవాడు లేక వెలవెలబోతోంది. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా విజయశేఖర్‌రెడ్డి ప్రధాన హైవేలో పార్టీ కార్యాలయాన్ని ఆర్భాటంగా ప్రారంభించి పార్టీ కార్యక్రమాలను ఉధృతి చేశారు. టికెట్టు రాకపోవడంతో అది మూతపడింది. పక్కా భవనాలు కలిగిన ఆకేపాటి భవన్, సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి చెందిన మేడా భవన్, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయి లోకేష్ విలాసవంతమైన భవన్‌లు ఎన్నికల ముందర కార్యకర్తలతో ఆర్భాటంగా కనిపించినా ఎమ్మెల్యే టికెట్టు లభించిన ఆకేపాటి భవన్ మినహా మిగిలిన వారి భవన్‌లు వెలవెల పోతున్నాయి.



కార్యకర్తలు లేక బోసిపోయివున్న గంటా మీటింగ్ హాల్



చూపుడాయకంగా మారిన రహస్య రాజకీయ మంతనాల గది



మూతపడిన మేడా విజయశేఖర్ రెడ్డి కార్యాలయం

పనిచేస్తుందా...?

వంద శాతం పోలింగ్‌కు బుడ్డోడి చిట్కా!



కలికిరి, మే 1: ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం వంద శాతం పెంచాలని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో షార్ట్ కట్‌గా పోలింగ్ శాతం గణనీయంగా పెంచేందుకు ఎలాంటి అవకాశాలున్నాయో తెలుసుకోవడానికి ఓ జిల్లా కలెక్టరు ప్రయత్నించారు. ఇందులో భాగంగా వందశాతం పోలింగ్ జరిగేందుకు ఎవరైనా సూచనలు చేయాలని ప్రకటిస్తూ మంచి సూచనలకు బహుమతులు కూడా వుంటాయని జిల్లా వ్యాప్తంగా ఆసక్తి వున్న వారు సూచనలు పంపవచ్చని ప్రకటించారు. ఇది తెలిసిన ఓ బుడ్డోడు ఇలా ఓ సూచన పంపించాడు.

అయ్యా.. నా విన్నపాన్ని పాటిస్తే వంద శాతం కాదుగదా 110 శాతం పోలింగ్ అయి తీరుతుంది. పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం ఇంటింటికీ వెళ్లి ఓటుకు రేటు కట్టి పంచుతారు కదా. ఇలా పంచడం తప్పని, వాటిని ఎవరూ అరికట్టలేకున్నారు. ఇప్పుడు దాన్నే మీరూ పాటించండి. ఒక్కో ఓటుకు ఎవరు ఎంత పంచాలనుకుంటున్నారో ఇరువర్గాల వారికీ లెక్కేసి మొత్తం మీ దగ్గర చేర్చమనండి. ఈ డబ్బంతా ఓటర్లను బట్టి బూత్‌లకు చేర్చండి. ఓటేస్తే డబ్బిస్తాం అని చిన్న ప్రకటన చేస్తే చాలు ఓటర్లు క్యూకడతారు. క్యాండిడేట్లు ఇచ్చిన డబ్బును ఆ ప్రకారంగా ఇచ్చేసి పక్కాగా రసీదు తీసుకోండి. దీంతో పిచ్చపిచ్చగా వందశాతం పోలింగు జరుగుతుంది. మరో 10 శాతం జనాలు ఓటేయకుండా ఇంకా బయట మిగిలుంటారు. వీళ్లంతా మామూలుగా ప్రతి ఎలెక్షనుకూ చివర్లో వచ్చి తమ పేర్లు ఓటర్ల లిస్టులో లేవని గగ్గోలు పెడుతుండే వారే. పనిలో పనిగా వీరి పేర్లు కూడా ఓటర్ల జాబితా కోసం రాసి పెట్టుకోండి. వచ్చే ఎలక్షన్‌కు వంద శాతం ఓటర్ల లిస్టు కూడా రెడీ అయిపోతుంది. మొత్తం మీద వంద శాతం పోలింగ్, వంద శాతం ఓటర్ల నమోదు.. ఒకే దెబ్బకు రెండు పిట్టలు. ఇదీ సార్ నా మాట. వంద శాతం పోలింగ్‌కు నా సలహా. ఇట్లు బుడ్డోడు. ఆ తరువాత ఆ కలెక్టరు ఏమయ్యారో తెలియడం లేదు.

రాయబేరాలు...

ప్యాకేజి వీరులు... ఓట్లు లేని ధీరులు



రైల్వేకోడూరు, మే 1: ఎన్నికల సమయంలో తమకు వేలాది ఓట్లు ఉన్నాయని, తాము చెప్పితే మండలం అంతా ఏ పార్టీకి చెబితే ఆ పార్టీకి ఓట్లు వేస్తారని చెప్పడం నాయకత్వం వహించే వారి చేత కోట్లల్లో ప్యాకేజిలు తీసుకోవడం పరిపాటిగా మారింది. నియోజకవర్గంలో ఒకప్పుడు ఓట్లు ఉన్న నేతలు జీరోలుగా మారారు. ఎందుకంటే ప్యాకేజిలు తీసుకో వడం, దీనికి తోడు పార్టీలు మారడంతోనే ఓట్లు పోగొట్టుకున్న వారు ఎందరో ఉన్నా రు. ఒక పార్టీ పై స్టాండర్డ్ లేక పోవడంతో ఉన్న ఓటు శాతం తగ్గిపోయింది. దీన్ని పార్టీల నాయకత్వాలు గమనించి ఓట్ల శాతం ఉందన్న నమ్మకంతో కోట్లలో ప్యాకేజిలు ఇస్తున్నారు. ప్యాకేజిలు ఇవ్వకుండా ప్రచారాలకు రాకపోవడం, అజ్ఞాతంలోకి వెళ్లడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా నాయకత్వాలు వీటిని గమనించి ఓట్లు ఉన్నవారికి ప్రాధాన్యత కల్పిస్తే వారు అనుకున్న లక్ష్యాలను చేరతారని రాజకీయ వేధావులు చెబుతున్నారు. లేకపోతే ఉన్న డబ్బు ప్యాకేజిలకే పోతుందనేది నగ్నసత్యంగా రాజకీ య విశ్లేషకులు చెబుతున్నారు. ఇదంతా ఎస్సీ నియోజకవర్గంలో జరగడం విశేషం. ఇదే కాకుండా ఓట్లు లేని నేతలకు ప్యాకేజిలు ఇవ్వడంతో పక్క పార్టీల వారు వరుస విజయాలు సాధిస్తున్నారనేది కొసమెరుపు..

ఇదో తుత్తి...

లక్ష్మీనారాయణ 'రికార్డు' సత్కారం



ఇటీవల చంద్రబాబును కలిసి సత్కరిస్తున్న టి.లక్ష్మీనారాయణ

రాజంపేట, మే1: ఎవరి పిచ్చి వారికి ఆనందం అన్నట్లు రాజంపేట పట్టణంలోని టీడీపీ సీనియర్ నేత, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణకు చంద్రబాబు పిచ్చి ఎక్కువ. తన ఆరాధ్య దైవమైన చంద్రబాబును ఇప్పటికి ఆయన అనేక సందర్భాల్లో కలిసి 92సార్లు సత్కరించారు. ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొనడం, సీనియర్ నేతగా సభల్లో ముందుకెళ్లిపోవడం, వెనువెంటనే అధినేతను కలిసి శాలువా, పూలబొకేతో సత్కరించవడం, ఆయనతో కలిసి ఫొటో తీసుకోవడం ఈయనకు మహదానందం. ఈయనకు మైకు పిచ్చి కూడా ఎక్కువ. ఏ టీడీపీ సభలోనైనా లక్ష్మీనారాయణ మైకు ఎత్తుకున్నాడంటే అక్కడున్న వారి పని అయిపోయినట్లే.. అమ్మో.. లక్ష్మీ నారాయణ అని చెవులు మూసుకుంటారు. ఆ విషయం అటుంచితే.. ఈయన లక్ష్యం చంద్రబాబును 108 సార్లు సత్కరించి ఆయన కరుణా కటాక్షాలను పొందాలని మొక్కుబడిగా పెట్టుకున్నాడు. అందులో భాగంగా ఇప్పటికి 92 సార్లు సత్కరించి సరికొత్త రికార్డును సొంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు.

అభిమానం....

ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న పూలవర్షం



కోడూరు జనసేన ప్రచారంలో కురుస్తున్న పూలవర్షం

రాజంపేట, మే1: ఇప్పుడు ఎన్నికలు చాలా కాస్ట్లీ అయిపోయాయి. దగ్గరదగ్గరగా ఒక్కో నేత సుమారు రూ.70 కోట్లు ఖర్చుపెడితే తప్ప ముందుకు సాగే ప్రసక్తి లేదు. ఇక ప్రచారాలకు కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఒక్క నియోజకవర్గమంటే ఐదు నుంచి ఆరు మండలాలుంటాయి. ఒక్కో మండలంలో 20 గ్రామ పంచాయతీల చొప్పున వంద పంచాయతీలుంటాయి. ఆ లెక్కన వెయ్యికి పైబడి మజరా గ్రామాలుంటాయి. ఈ గ్రామాలన్నింటిలోనూ ప్రచారం చేయాల్సిందే. ఒక పల్లెలో ప్రచారం చేయాలంటే 15 రోజులకు రెండు లక్షలు ఖర్చు అవుతోంది. గానాభజానా, డప్పులు, పూలవర్షాలు, బాణసంచాలు, కేరింతలు, రకరకాల ఆర్భాటాలు, ప్రధానంగా బిర్యానీలు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసిమోపెడవుతోంది. ఈ కోవలో రైల్వేకోడూరు నియోజక వర్గంలోని జనసేన, టీడీపీ నేతలు కలిసి చేస్తున్న ప్రచారాలు పెద్దఆర్భాటంగా సాగుతున్నాయి. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ తరఫున టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబమంతా ప్రచారంలో మునిగి తేలుతోంది. ఈ ప్రచారం సందర్భంగా చేస్తున్న ఆర్భాటాలను చూసి ఔరా.. ఈ ఎన్నికలు అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఓటరన్న కటాక్షం కోసం ఎన్నెన్ని పాట్లో..



మోకాళ్లపై కూర్చుని ఓ అవ్వకు నమస్కరిస్తూ ఓటు అడుగుతున్న అతికారి దినేష్

రాజంపేట, మే1: ఓటరన్న కృప కటాక్షం కోసం ఎన్ని పాట్లైనా పడతారు. ఎన్నికల తరువాత తాము ప్రజాప్రతినిధులుగా గెలిస్తే వారి ఫోజుకు అంతే ఉండదు.. ఆయనే అవతారపురుషుడైనట్లు.. పీలవుతూ ఓటర్లను చిన్నచూపు చూడటం పరిపాటి. ప్రస్తుత ఎన్నికల సమయంలో ఓటర్ల దయాదాక్షిణ్యాల కోసం పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. కొందరు కాళ్లావేళ్లా పడితే మరికొందరు వంగివంగి దండాలు పెడితే.. మరికొందరు కింద కూర్చుని బతిమలాడితే... ఇలా అనేక రకాలుగా ఓటర్లను అభ్యర్థిస్తూ వారి గడ్డాలు పట్టుకుంటూ తమ పవిత్రమైన ఓటును మాకు వేసి గెలిపించాలని కోరుతూ విజ్ఞప్తి చేస్తుంటారు. ఈ కోవలో రాజంపేట జనసేన నియోజకవర్గ నేత అతికారి దినేష్ పాట్లు చూడండి.. ఆయన ఇటీవల జనసేన టికెట్టు కోసం చాలా వరకు ప్రయత్నించారు. తమ సమీప బంధువు సుగవాసి బాలసుబ్రమణ్యంకు టికెట్టు ఖరారవడంతో ఆయన గెలుపు కోసం పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. కొందరి వద్ద కింద కూర్చుని బతిమలాడటం, మోకాళ్లపై కూర్చుని వంగివంగి దండాలు పెట్టడం చూసి నవ్వుకోవాల్సిన పరిస్థితి. ఔరా... ఓటరన్నకు ఎన్నికల సమయంలో ఎంత విలువుందో ఇట్టే తెలుస్తోంది. ఎన్నికల తరువాత అంతా తూచ్.. అనిపిస్తుంది.



ఇది పుల్లూరు సచివాలయం. పైభాగంలో సీఎం జగన్ చిత్రం ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చి రెండు నెలలవుతున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కలుగజేసుకుని కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- ఖాజీపేట

అక్రమ ఇసుక రవాణా అరికట్టే వారు లేరా ?

● అధికార పార్టీ నేతలకు అధికారుల అండ



రాత్రిళ్లు తరలిపోతున్న ఇసుక

జమ్మలమడుగు, మే 1: జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణాను అదుపు చేసే వారు ఎవరూ లేరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గూడెం చెరువు, అంబవరం, పొన్నతోట, గొరిగెనూరు తదితర ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ప్రొద్దుటూరు రోడ్డులోని పి.సుగుమంచిపల్లె, పెన్నానది నుంచి కాకిరేనిపల్లె మీదుగా తరలిపోతోంది. మైలవరం మండలం దొమ్మరనంద్యాలలో పెన్నానది నుంచి బైపాస్ రోడ్డు గుండా సరిహద్దులు దాటుతోంది. జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాల్లో ఎస్ఈబీ అధికారులు, పోలీసులు అక్రమ ఇసుక రవాణాకు అదుపు చేయడంలో విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. కొందరికి మాత్రం అక్రమ ఇసుక రవాణాలో లాభం ఉన్నట్లుగా అందుకే ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. రాత్రిళ్లు పాత బస్టాండు గాంధీ విగ్రహం మీదుగా కూరగాయల మార్కెట్, కాపువీధుల్లో అక్రమ ఇసుక ట్రాక్టర్ల వేగానికి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీటీ కళాశాలలో ఫోర్‌మెన్ కమిటీ విచారణ

● రహస్య విచారణ మతలబు ఏమిటి..?
● విద్యార్థి సంఘాల ఆందోళన

మదనపల్లె టౌన్, మే 1: బీటీ కళాశాల ప్రభుత్వ పరమైనప్పటి నుంచి అక్కడ దశాబ్దాలుగా పనిచేసిన ఆరుగురు ఒప్పంద ఉద్యోగుల పర్మనెంట్ విషయమై బుధవారం హయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి నలుగురు కమిటీ సభ్యులు విచారణ జరిపారు. బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విషయమై విచారణ కమిటీ సభ్యులకు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన విద్యార్థి సంఘాలను కళాశాల లోనికి అనుమతించలేదు. దీంతో వారు గేటు ముందే మాట్లాడుతూ అర్హత లేని వారిని బోధన సిబ్బందిగా నియమించుకున్నారని, అర్హులైన ఆరుగురు బోధనేతర సిబ్బందికి అన్యాయం చేస్తున్నారన్నారు. తమను కళాశాలలోకి అనుమతించకుండా రహస్యంగా విచారణ చేపట్టడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు. అర్హులకు న్యాయం చేయకుంటే ఎన్నికల కోడ్ అనంతరం ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ ఉత్తన్న, బీవైఎస్ పునీత్, గంగరాజు, నవీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

● చెల్లెలి ఇంటికి వచ్చి అక్క అనంతలోకానికి..

పెద్దతిప్పసముద్రం మే 1 : కరెంట్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన పీటీఎం మండలం కాట్నగల్లు పంచాయతీ దూలంవారిపల్లెలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు దూలంవారిపల్లెకు చెందిన దూలం శ్రీనివాసులురెడ్డి భార్య గీతమ్మది పుట్టినిల్లు ఓడిసి. ఆమె అక్క అయిన మంజుల (46)ను నల్లచెరువు మండలం రాగన్నగారిపల్లెకు ఇచ్చారు. కాగా గత కొన్ని సంవత్సరాల క్రితం మంజుల భర్త మృతి చెందాడు. అయితే తన చెల్లెలు అయిన గీతమ్మను చూసేందుకు దూలంవారిపల్లెకు ఇటీవల వచ్చింది. బుధవారం ఉదయం మంజుల స్నానం చేసేందుకు బాత్రూంలో హీటర్ స్విచ్ వేయడంతో ఒక్క సారిగా కరెంట్ షాక్‌తో కింద పడిపోయింది. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె మృతదేహాన్ని నల్లచెరువు మండలం రాగన్నగారిపల్లెకు తరలించి దహనక్రియలు నిర్వహించినట్లు కుటుంబీకులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దమండ్యం, మే 1: పెద్దమండ్యం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ పి.తురకపల్లి కు చెందిన ఎస్.హీరన్ బాషా (36) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పెద్దమండ్యం ఎస్ఐ చెన్నకేశవ వెల్లడించారు. పి.తురకపల్లికు చెందిన హీరన్ బాషాకు గుర్రంకొండ మండలంకు చెందిన షానుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. హీరన్ పలు వ్యసనా లకు బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన హీరన్ రెండు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుకున్న బంధువులు చికిత్స నిమిత్తం అతన్ని 108 వాహనంలో రాయచోటి కి తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హీరన్ మృతి చెందినట్లు బుధవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


తంబళ్లపల్లెలో అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి


బి.కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు


పీలేరులో మరణించిన కార్మికుల కుటుంబసభ్యులతో బహుజన సంఘ నేతలు

తంబళ్లపల్లె, మే 1: కార్మికులు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కులు, చట్టాలు, కార్మికుల పనికి సంబంధించిన విషయాలతో పాటు లోక్‌అదాలత్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసుల రెడ్డి, ఇన్‌స్ట్రక్టర్లు రమణ, సురేంద్ర, అశోక్ కోర్టు సిబ్బంది గురుప్రసాద్, ఇర్ఫాన్, కార్మికులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్/అర్బన్‌లో: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం మదనపల్లె పట్టణంలో కార్మిక సంఘాలు ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక టమోటా మార్కెట్ వద్ద టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో టీడీపీ మైనారిటి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ టీఎన్‌టీయూసీ జెండా ఎగురవేసి కార్మికుల సమస్యలు పరిష్కరించేంది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఐటీయూసీ డివిజన్ కన్వీనర్ జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు కార్మికుల కష్టాన్ని దోచుకుతింటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మౌలాలి, తులసికృష్ణ, నాగేశ్వర, పాండు, మనోహర్, రెడ్డెప్ప పాల్గొన్నారు. మేడే పురస్కరించుకుని శిశుసంక్షేమశాఖ వద్ద సీఐటీయూ జిల్లా కోశాధికారి హరేంద్రనాథ్‌శర్మ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి అనంతరం కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మధురవాణి పాల్గొన్నారు. నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు వద్ద ఆటో యూనియన్, ఎద్దుల బండ్ల యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు నాయకులు నాగరాజ, గోపాల్, పాల్గొన్నారు. మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు జె.శ్రీనివాసులు, యూనియన్ నాయకులు బీవీ రమణ మోదీన్‌బాషా, మేస్త్రీలు, సీపీఐ మురళి వేడుకలు నిర్వహించారు.

నిమ్మనపల్లిలో: శ్రామికుల జీవితాల్లో పెనుమార్పులకు శ్రీకారం చుట్టినది మేడే అని ప్రజాసేవాసంస్థ అధ్యక్షుడు సహదేవ పేర్కొన్నారు. బుధవారం మే డే సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. 1886లో షికాగో మార్కెట్ తొలిసారిగా మేడే వేడుకలు జరుపుకొని కార్మికులంటే ప్రపంచానికి తెలియజేశారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వాలు కార్మికులపై చిన్నచూపు చూస్తూ వారిని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ముబారక్, రెడ్డెప్ప, వెంకటరమణ, సుదాకర్, యర్రయ్య, సోము, రమణ, శంకర పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట పట్టణంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే ను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని దిగువబస్టాండు, పీటీయంరోడ్డు సర్కిల్‌లలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాలలో ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సలీంబాషా, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి లు మాట్లాడుతూ కార్మికులు, పేదల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకై పాలకులను, ప్రభుత్వాలను నిలదీసే బలమైన గొంతుక ఎర్రజెండా అని అన్నారు. అనంతరం బ్యానర్లు చేతపట్టి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారికి రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎన్ చంద్రశేఖరరెడ్డి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు బషీర్‌ఖాన్,రఘునాథ్,సమీవుల్లా, అష్రఫ్‌అలీ,అలివేలమ్మ, ఖాదర్‌బాషా, చౌడప్ప,బావాజాన్ షఫీ, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో: కార్మికుల పండుగ అయిన మేడేను బుధవారం పీలేరులోని పలు కార్మిక, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు, బిల్డింగ్ వర్కర్స్ సంఘాలు ఘనంగా నిర్వహించారు. పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ, యూటీఎఫ్, ఏఐటీ యూసీ, ఏఐవైఎఫ్, ఎస్‌టీయూ, డప్పు కళాకారుల సంఘ నాయకులు ఎర్ర జెండాను ఆవిష్కరించారు. బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పంచాయతీ కార్మికుల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామయ్య, యూటీఎఫ్ నాయకులు రాధాకృష్ణ, పురుషోత్తం, నాగరాజ, బిల్డింగ్ వర్కర్స్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు బలరాం, ఏఐవైఎఫ్ నాయకులు టీఎల్ వెంకటేశ్, ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, ఎస్‌టీయూ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, యశోద, సరస్వతి, రత్నమ్మ, శ్రీనివాసులు, భాస్కరరెడ్డి, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో రెండు బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్ల ఏర్పాటు

కలికిరి, మే 1: మండలంలో కొత్తగా రెండు బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లను ఏర్పాటు చేశారు. రూరల్ కనెక్టివిటీని పెంచే దిశగా ఈ కొత్త 4జీ టవర్లను నెలకొల్పారు. సీఆర్‌పీఎఫ్ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో ఏర్పా టు చేసిన టవర్‌ను డీఐజీ అనుపమ్ శర్మ ప్రారంభించారు. అదే విధం గా మద్దలచెరువుపాలెం (ఎంసీ పాలెం) సమీపంలో మరో టవర్‌ను ప్రారంభించారు. ఇందులో ఒక్కో టవరు 2.5 చదరపు కి.మీ వైశాల్యం లో 4జీ సంకేతాలను శక్తివంతంగా అందజేస్తాయని టెలికాం అధికారు లు తెలిపారు. ఆత్మ నిర్భర భారత్‌లో భాగంగా పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, స్వదేశీ పరికరాలతో ఈ రెండు టవర్లను నెలకొల్పినట్లు పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవాల్లో సీఆర్పీఎఫ్ కమాండెంట్ నీరజ్‌కు మార్ పాండే, ఏపీ టెలికామ్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజరు ఎం.శేషా చలం, విజయవాడ జనరల్ మేనేజర్ ఎ.శ్రీనివాస రావు, తిరుపతి ప్రిన్సిపల్ జనరల్ మేనేజరు సి.అమరేంద్ర రెడ్డి, డీఈ జి.వెంకటా చలపతి, డీజీఎం జయశంకర్, జేఈ రామచంద్ర పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


పాపేపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

పెద్దమండ్యం, మే 1: ఎన్నికల సమయంలో గతంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. పెద్దమండ్యం మండలంలో బుధవారం డీఎస్పీ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల, పాపేపల్లి తదితర పోలింగ్ కేంద్రాల వివరాలను, పలు అంశాలను పోలీసులు వివరించారు ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకోవడానికి పూర్తిగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఎన్నికలు ప్రశాంతగ జరగడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంట ములకలచెరువు సీఐ మధు, ఎస్ఐ చెన్నకేశవ స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో కారు బోల్తా

బి.కొత్తకోట, మే1: బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులోని రేణిమాను మలుపు వద్ద బుధవారం ఓ కారు బోల్తా పడింది. కర్ణాటక రాష్ట్రం గౌనిపల్లె కు చెందిన ఓ కుటుంబం హిల్స్‌కు వచ్చి తిరుగు ప్రయాణంలో కొండ దిగుతుండగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. రోడ్డు పక్కనున్న పిట్టగోడ కారును నిలువరించడంతో ప్రమాదం తప్పింది. వాహనంలో ఉన్న వారంతా స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

ఉచిత వాలీబాల్ శిక్షణ

తంబళ్లపల్లె, మే 1: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని పాత కళాశాల మైదానంలో ఉచిత వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని శిక్షకుడు మహమ్మద్ యూనస్ తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపును అన్నమయ్య జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా సమయంలో పిల్లలకు గుడ్డు, అరటి పండు వంటి పౌష్టికాహారం అందచేస్తామన్నారు. ప్రతి ఆదివారం యోగా మాస్టర్ చేత యోగా క్లాసు ఉంటుందన్నారు. కాగా, బుధవారం మొదటి రోజు ఈ క్యాంపునకు పలు ప్రాంతాలకు చెందిన సుమారు 75 మంది హాజరైనట్లు తెలిపారు.

భాస్కర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం


భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి

మదనపల్లె అర్బన్, మే1: పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి ఉపాధ్యాయ వర్గానికి, పెన్షనర్స్‌కు చేసిన సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి కొనియాడారు. బుధవారం స్థానిక మిషన్ కాంపౌండ్‌లోని కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భాస్కర్‌రెడ్డి పదవీ విరమణ సభలో ఆయన తోపాటు ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంట మోహన్, కడియాల మురళీలు భాస్కర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిమ్మనపల్లె, పుంగనూరు ఎంఈవోలు పద్మావతి, రెడ్డెన్నశెట్టి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, పోకల మదుసూదన్, రాష్ట్ర కౌన్సిల్ రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జగన్మోహన్‌రెడ్డి,వేణుగోపాల్‌రెడ్డి, జయరాంరెడ్డి, మోహ న్, శ్రీనివాసులు, గురుమూర్తి, రమణ, జనార్ధన్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, రవి, పాల్గొన్నారు.

గురజాలను సన్మానించిన పీలేరు నేతలు

పీలేరు, మే 1: అడవిపల్లె ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన చిత్తూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను బుధవారం పీలేరు టీడీపీ నేతలు సన్మానించారు. నేతలు దగ్గుబాటి వేంకటేశ్వరరావు, తిమ్మాపురం రఘురామిరెడ్డి, గాలి సుధాకర్ నాయుడు, ఎంజీవీ రమణ ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా దగ్గుబాటి వేంకటేశ్వర రావు మాట్లాడుతూ చిత్తూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు టీడీపీ చిత్తశుద్ధితో ఉందని, వచ్చే ఎన్నికల్లో గురజాల జగన్మోహన్ చిత్తూరు ఎమ్మెల్యేగా గెలవడం తథ్యమన్నారు.

సీటీఎంలో ఉచిత సమ్మర్ కోచింగ్

మదనపల్లె టౌన్, మే1: మదనపల్లె మండలం సీటీఎం జడ్పీ హైస్కూల్ మైదానంలో మే 1వ తేదీ నుంచి నెల రోజులపాటు ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పీడీ, కోచ్ నరేష్‌బాబు తెలిపారు. జినరాజదాస హాకీ, ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో ఉదయం 6నుంచి 8గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కోచింగ్ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 6281881022 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ధనుంజయ

తంబళ్లపల్లె, మే 1: తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మండలంలోని జుంజురపెంట పంచాయతీ కమ్మలవాండ్లపల్లెకు చెందిన ధనుంజయరాయల్ నియమితులయ్యారు. రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు ఆదేశాలతో పార్లమెంటు తెలుగుయువత అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ధనుంజయ మాట్లాడుతూ..తనపై ఎంతో నమ్మకంతో తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. తనకీ అవకాశం కల్పించిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డికి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబుకు, నియోజకవర్గ పరిశీలకుడు సీడ్ మల్లికార్జుననాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

బి కొత్తకోటలో కేంద్రబలగాల మార్చ్‌ఫాస్ట్

బి కొత్తకోట, మే1: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బి.కొత్తకోట పట్టణంలో బుధవారం కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండడంతోపాటు ఓటర్లు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ విషయాలు ప్రజల్లోకి వెళ్లేవిధంగా ఈ మార్చ్‌ఫాస్ట్ ను నిర్వహించినట్లు సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్రబలగాలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్ గెలుపు ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బానుప్రకాష్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, మే1: రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం స్థానిక బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయ మాట్లాడుతూ ఇప్పటికే ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు రాజంపేట ఎంపీ నల్లారికిరణ్, మదనపల్లె అసెంబ్లీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా ప్రచారంలో దూసుకెళ్లుతున్నారని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రచారంలో స్పందన లభిస్తోందన్నారు. ఏపీ అప్పుల నుంచి అభివృద్ధి వైపు వెళ్లాలన్నా సమర్థవంత నాయకత్వ లక్షణాలు కలిగిన కిరణ్‌కుమార్‌రెడ్డిని లోకసభకు పంపాలని పిలుపునిచ్చారు. .రాష్ట్రంలో అవినీతి, దోపిడీ, దౌర్జన్య పాలన శాశ్వితంగా లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డి కుమారుడు నిఖిలేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు బర్నేపల్లె రవికుమార్, యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, కిరణ్‌కుమార్, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు వసంతకుమార్, వేణుగోపాల్, భగవాన్ పాల్గొన్నారు.

యువత ఆలోచించి..అభ్యర్థులను ఎన్నుకోండి


తెలుగు యువత ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ తనయుడు నల్లారి నిఖిలేష్‌రెడ్డి

మదనపల్లె టౌన్, మే 1: ఓటు హక్కు వచ్చిన ప్రతి యువత ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థుల గుణాలు చూసి, ఆలోచించి ఓటు వేసి ఎన్నుకోవాలని పార్లమెంట్ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తనయుడు నల్లారి నిఖిలేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో తెలుగు యువత ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన యువతతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిఖిలేష్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ బరిలో ఉన్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సౌమ్యుడు, నిజాయితీ పరుడన్నారు. కాని ప్రత్యర్థి బరిలో ఉన్న మిధున్‌రెడ్డి సంస్కార హీనుడని, అవినీతి పరుడన్నారు. యువతకు మంచి భవిష్యత్ కావాలంటే కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి లోకేశ్ యువగళం పాదయాత్రలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారన్నారు. సమావేశం నిర్వాహకులు మార్పురి వరుణ్, పెరవలి నవీన్, నిరంజన్‌నాని, వంశీనరసింహ, రాటకొండ రాజేశ్, క్రాంతి, నాదెళ్ల అరుణ్‌తేజ్ నిఖిలేష్‌కు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా, రాటకొండ గురుప్రసాద్, మార్పురి సుధాకర్ నాయుడు, ఎస్ఏ మస్తాన్, హరిహరన్, జంగాల శివరామ్, ఆకుల కృష్ణమూర్తి, ఓసూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఈవీఎంల ర్యాండమైజేషన్


ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న ఆర్వో ఫర్మాన్ అహ్మద్

పీలేరు, మే 1: సార్వత్రిక ఎన్నికల కోసం వినియోగించాల్సిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఎంపిక కోసం బుధవారం పీలేరు తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో ఫర్మాన్ అహ్మద్ అధ్యక్షతన ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయన ఈ ప్రక్రియ ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రానికి కేటాయించాల్సిన పోలింగ్ యూనిట్, వీవీ ప్యాట్ మెషీన్ల ఎంపిక కోసం ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తారని, ఎంపికైన మెషీన్ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని, పోలింగ్ రోజున వారు తమ పోలింగ్ కేంద్రాలకు ఆయా మెషీన్లు వచ్చాయో లేదో సరిచూసుకోవచ్చన్నారు. అదే విధంగా ఎంపిక చేసినమెషీన్లకు గురువారం ఉదయం 7 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశా లలోని స్ట్రాంగ్ రూములో కమిషన్ చేస్తామన్నారు. దాంతో ప్రతి పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిన మెషీన్ల ఎంపిక పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌వోలు మహబూబ్ బాషా, ఖతీజున్ ఖుబ్రా, విజయకుమారి, ప్రియదర్శిని, ప్రదీప్, శ్రీనివాసులు, ఏఎస్‌వో రామ్మోహన్, డీటీ సుబ్రహ్మణ్యం, టీడీపీ నేత సుబహాన్, బీఎస్పీ నేత వెంకరరమణ, కాంగ్రెస్ నేత శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం


ప్రచారంలో కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి


ములకలచెరువులో ప్రచారంలో కల్పనరెడ్డి

తంబళ్లపల్లె/పెద్దతిప్పసముద్రం/ములకలచెరువు, మే 1: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లందరూ సైకిల్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి కూటమి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. అంతకుముందు తంబ ళ్లపల్లె మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయ కులు వెంకటనారాయణ, శ్రీనివాసులరెడ్డి, సురేంద్రలు జయచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ పోతులసాయినాథ్, బీజేపీ నేతలు గోపాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, తెలుగు యువత నాయకులు దేరంగుల చంద్ర పాల్గొన్నారు. పీటీఎం మండలంలోని పలు గ్రామాల నుంచి పలువురు వైసీపీ నాయకులు జయచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరగా వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తుమ్మరకుంట గ్రామం బండమీదపల్లెకు చెందిన మాజీ ఉపసర్పంచ్ నారాయణప్ప, సుధాకర్, శంకర, రెడ్డెప్ప, పెద్ద వెంకటేష్, రమేష్, వెంకట్రమణ, కదిరప్ప, పెద్దనా రాయణ, పెద్ద వెంకట్రమణ ఉన్నారు. ములకలచెరువు మండలంలో బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.అలాగే అభ్యర్థి జయచంద్రారెడ్డి పర్తికోట, దేవళచెరువుల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, తన అన్న మంత్రి గిరిధర్‌రెడ్డి నియో జకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, అధ్యక్షుడు చెన్నకిష్టా, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, గాలి నారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు.

యువతను అసాంఘిక శక్తులుగా మార్చిన వైసీపీ

● రాజకీయాల కోసం వారిని పావులుగా వాడుకుంటున్నారు ● పీలేరులో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ధ్వజం


పీలేరులో కిశోర్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న యువత


వాల్మీకిపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి తనూజారెడ్డి

పీలేరు, మే 1: రాజకీయ అవసరాల కోసం యువతను అసాంఘిక శక్తులుగా వైసీపీ నాయకులు మార్చివేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పీలేరు మండలం తలపుల, జాండ్ల, మేళ్లచెరువు పంచాయతీల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తలపులలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పీలేరు మండలం వేపులబైలు గ్రామం వద్ద స్థానిక వైసీపీ నాయకుల ప్రోద్బలంతో సుమారు 30 మంది యువకులు టీడీపీ పార్టీ ప్రచార వాహనాలపై దాడి చేసి కేసుల్లో ఇరుక్కున్నారన్నారు. చదువుకున్న యువకులకు ఉద్యోగాలు కల్పించి వారి భవిష్యత్తును బంగారుమయం చేయాల్సిందిపోయి కేసుల్లో ఇరికించి చీకటిమయం చేస్తున్నారన్నారు. ప్రజలు వైసీపీ నాయకుల కుతంత్రాలను గుర్తించి ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో పట్ల రాష్ట్రవ్యాప్తంగా అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. పీలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తనను, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బెజవాడ దినేశ్, టీడీపీ నాయకులు అబ్బవరం అమరనాథరెడ్డి, రాజగోపాల్ నాయుడు, జాండ్ల బాబ్జీ, అన్నారెడ్డి, ఆనందరెడ్డి, చంద్రా నాయక్, పాల్గొన్నారు.

కిశోర్‌కు మద్దతు పలికిన బెస్త సంఘం నాయకులు

పీలేరు నియోజకవర్గ బెస్త సంక్షేమ సంఘం నాయకులు బుధవారం కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డికి మద్దతు పలికారు. స్థానిక తిరుపతి రోడ్డులోని బెస్త సంఘం కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తమ కులస్థులందరూ కిశోర్ గెలుపుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బెస్త సంఘ నాయకులు బీసీ రెడ్డప్ప, కృష్ణయ్య, రూపేష్ కుమార్, టి.రెడ్డప్ప, వెంకటస్వామి, నాగేంద్ర, ఆదినారాయణ, నాగ, వెంకటేశ్వర్లు, ఎ.దేవ, కె.నాగరాజ, నారాయణస్వామి, నవీన్ కుమార్, అశోక్ కుమార్, చంద్రమ్మ, అనసూయమ్మ, సంపూర్ణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం. అభివృద్ధి

వాల్మీకిపురం, మే 1: కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పీలేరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వాల్మీకిపురం మండలంలోని మూరేవాండ్లపల్లె గ్రామ పంచాయతీలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీలోని గ్రామాలలో నల్లారి తనూజారెడ్డికి మహిళలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. 13న జరిగే పోలింగ్‌లో రాజంపేట ఎంపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కమలం గుర్తుపై, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్‌రెడ్డి, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షు మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, కృష్ణారెడ్డి, నారాయణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, ద్వారకనాథరెడ్డి, శేషాద్రిరెడ్డి, మురళి, గిరిబాబు, సయ్యద్‌బాషా, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, డిష్ బ్రదర్స్, జయకృష్ణ, తెలుగు యువత చాను, న్యాయవాది రమణ, గాంధీపేట రెడ్డి, స్వర్ణలత, గంగులప్ప, రెడ్డెప్ప, ఆదినారాయణ పాల్గొన్నారు.



శ్రీ మండు

ఓసీ కాసులు ఎందుకు కొదులుకోవల్ల !



ప్రెచారాలు జోరుగా సాగతా వుండాయిగదా ఇప్పుడు. కూలీ కాసులు గూడా బాగానే ముడతా వుండాయంట. ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా ఏ పార్టీ ఎప్పుడు ప్రెచారాలకీ, ర్యాలీలకీ పిలిస్తే వోటికి జనం పొలోమంటా ఎల్లిపోతా వుండారు. అర్దపూటో లేకపోతే రెండుమూడు గంటలో మాత్రమే ఉంటాయి ఏ ప్రెచారమైనా. ఇంతమాత్రానికే దినానికి ఐదు నూర్లు కాసులు, బిరియానీ ప్యాకెట్లు ఇస్తారు. మొగోళ్లకయితే క్వార్టరు మొందు బాటిలు ఎక్స్ట్రా. అందుకే పార్టీలమజ్జ తేడాలు చూపడంలేదు జనం. తాము ఓటు ఏసేది ఎవురికైనా పిలిస్తేసాలు పార్టీ ఏదని చూడకుండా పొలోమని ఎల్లిపోతా వుండారు. ఈ మజ్జ కుప్పంలో జరిగే ర్యాలీకి శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో అధికార పార్టీ జనాన్ని కూడే సింది. వాళ్లల్లో పక్కా టీడీపీ ఓటర్లు శానామందే ఉండారు. తాము వైసీపీ ర్యాలీకి ఎల్లినట్లు తెలిస్తే, టీడీపీ నాయకులు ఏమనుకుంటారో ఏంపాడో అని వాళ్లల్లో వారికే శంక అయిపొయ్యింది. అప్పుడు పార్టీ నాయకులకు వాళ్లనింకా ఫోన్లు వొచ్చినాయి. 'మేము వైసీపీ ర్యాలీకి ఎల్తావుండామప్పా. మనిషికి ఐదొందలు ఇచ్చినారు. బిరియానీ ప్యాకెట్లు కూడా ఇస్తా రంట. మొగోల్లకు క్వార్టరు బాటిలు చేతిలో పెడ్తామని చెప్తావుండారు. ఊరికే వొచ్చే కాసులు, ఎందుకు కాలదన్నుకోవల్ల సెప్పండి? కానీ సత్తె ప్రెమానికంగా చెప్తావుండామప్పా. ఓటు మాత్రం మన సైకిలుమిందే గుద్దతాము' అని ఫోన్లుచేసి సెప్పి ప్రెమాణాలు గూడా సేసినారంట. వైసీపీ పార్టీవోల్లకు కూడా ర్యాలీకి వొచ్చిన జనంలో సగంమంది ఓట్లు తమకు పడేవి కావని తెలిసినా.. జనం కావల్ల కాబట్టి తెలియనట్లే గమ్మున ఐదు నూర్లు కాసులు పంచేసి పిల్సకపొయ్యినారంట.

- కుప్పం

● మీకు తెలుసా?

ఖైదీలకూ ఓటు

రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాల వల్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా... ఉండదా అనే ప్రశ్న చాలా మంది తలెత్తవచ్చు. అయితే ఖైదీలకు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. వివిధ నేరాల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయొచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ, తాము ఓటర్లమని, పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాతపూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పిస్తారు.

- చిత్తూరు

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు



ఎన్నికల అధికారులు మూడు రకాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించారు. మొదటిది సాధారణ.. రెండోది సమస్యాత్మక.. మూడోది అత్యంత సమస్యాత్మకమైనవి. రాజకీయ పార్టీలు, తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు, ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ విభజన జరిగింది.

● నోట్ దిస్ పాయింట్

సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియోట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసివుంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

- చిత్తూరు కలెక్టరేట్

చిత్తూరు జన చేతనం





నాయకుడికి దూరచూపు ఉండాలి. అభివృద్ధికి అర్థం తెలియాలి. విజన్ కొరవడిన పాలన వర్తమానంలో కూరుకుపోతుంది. భవిష్యత్ తరాలకు ద్రోహం జరుగుతుంది. అభివృద్ధి అంటే ఓట్లలెక్కలు కాదు. అభివృద్ధి అంటే కరెంటు ఛార్జీలు పెంచి, పన్నులు పెంచి, ధరలు పెంచి, మద్యం ఏరుల్లా పారించి... ఎడాపెడా బాదేసి సంక్షేమం అంటూ నగదు విదిల్చడం కాదు. అభివృద్ధి అంటే చదువుల పందిరి వేయడం. అభివృద్ధి అంటే ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం. అభివృద్ధి అంటే ఉపాధికి బాటలు పరవడం.. మరి ఒక్క ఛాన్స్‌తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి చేసిందేమిటి? పాదయాత్రలో జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై చెప్పిన మాటలన్నీ ఆచరణలో అమలయ్యాయా? అంతకుముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏం చేశారు? జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఇద్దరు నేతల ముద్రలేమిటో చూద్దాం...

చిత్తూరు, ఆంధ్రజ్యోతి

విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు ఉన్న పేరు 2014-19 నడుమ నిజం అని రుజువైంది. విభజన తర్వాత రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక రంగాన్ని ఎంచుకున్నారు. ఫలితం.. ఆ ఐదేళ్లలో దేశ, విదేశీ, బహుళ జాతి కంపెనీలెన్నో కొలువు దీరాయి. 2014-19 నడుమ లక్ష మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలూ వృద్ధి చెందాయి.



2019 ఎన్నికల్లో గెలిచి జగన్‌రెడ్డి సీఎం అయ్యారు. అప్పటి దాకా ఉమ్మడి జిల్లాలో పనులు మొదలు పెట్టని పరిశ్రమల యాజమాన్యాలన్నీ ఏర్పాటు ప్రతిపాదనలను విరమించుకున్నాయి. కొత్త ప్రతిపాదనలూ లేవు. ఉన్నవి తప్పితే అదనంగా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. అనేక పరిశ్రమలు విస్తరణను విరమించుకున్నాయి. రిలయన్స్ జియో వెనక్కి వెళ్లింది. అమరరాజ పొరుగు రాష్ట్రాలకు పారిపోయింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం పాలనా తీరుకు కొలబద్దగా ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి స్తంభించిపోయింది.

2019-24 జగన్ పాలనలో చీకట్లు

కుప్పంలోనే 8 సంస్థలు వెనక్కి

వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన యాజమాన్యాలతో చర్చించలేదు. పైగా ఉన్న పరిశ్రమల మీద కక్ష సాధింపు చర్యలకు దిగారు. ఈ పరిణామాలను చూసిన వారంతా పరిశ్రమల స్థాపనకు ముందుకు రాలేదు. కుప్పం నియోజకవర్గంలోనే దాదాపు రూ.3 వేల కోట్ల పెట్టుబడులు ఆగిపోయాయి. బ్రిటానియా, ఆదిత్యా బిర్లా, వైష్ణవి మెగా ఫుడ్‌పార్కు, తిరుపూర్ గార్మెంట్స్ వంటి ఎనిమిది సంస్థలు రాలేదు. ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై పాదయాత్రలో ఇచ్చిన హామీలనూ జగన్ నెరవేర్చలేదు.

జిల్లా పారిశ్రామిక చిత్రపటం

అక్కడితో వదిలేశారు



గంగాధరనెల్లూరులో టీడీపీ ప్రభుత్వం పరిశ్రమల కోసం 25 ఎకరాలను తీసుకుని రహదారులు అభివృద్ధి చేసి, విద్యుత్తు సౌకర్యం, మౌలిక వసతులు కల్పించింది. అప్పట్లో ఐదు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వైసీపీ వచ్చిన ఈ ఐదేళ్లలో ఇటువైపు కన్నెత్తి చూసేవాళ్లు లేరు. ఇంకా సుమారు 20 ఎకరాల స్థలమున్నా ఇతర పరిశ్రమల ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం చొరవ చూపలేదు.

'గుండ్రాజుపల్లె'ను విస్మరించారు

గంగవరం మండలం గుండ్రాజుపల్లెలో 482 ఎకరాల భూమిని రూ.96 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కర్ణాటక సరిహద్దున ఉన్న ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పిస్తే పరిశ్రమలు ఏర్పాటవుతాయి. తద్వారా యువతకు ఉపాధితో పాటు, ఈ ప్రాంతమూ అభివృద్ధి చెందేది. ఈ దిశగా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

2014-19 చంద్రబాబు హయాంలో వెలుగులు



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాకు పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చాయి. రూ.19452 కోట్లతో పెద్ద, భారీ, చిన్న పరిశ్రమలు లక్ష మందికిపైగా ఉపాధి కల్పించాయి. వీటితో పాటు రూ.2200 కోట్ల పెట్టుబడితో 3 వేల ఎంఎస్ఎంఈలు సుమారు 60 వేల మందికిపైగా ఉపాధిని ఇస్తున్నాయి. టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటైన 11 ప్రసిద్ధ పరిశ్రమలు గురించి చెప్పుకుంటే.. సత్యవేడులో హీరో మోటార్స్, ఏర్పేడులో రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, సన్నీ ఒపో టెక్, శ్రీసిటీలో యూఎస్‌జీ బోరాల్స్, టాటా స్మార్ట్ ఫుడ్, సుందరం ఫాస్ట్‌నర్స్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్, టీవీఎస్ బ్రేక్స్ ఇండియా లిమిటెడ్, గంగవరం మండలం గుండ్రాజుపల్లెలో ఫామ్‌గేట్, విశ్వ అపరైల్స్, తొట్టంబేడులో కజారియా ఇండస్ట్రీస్ ఉన్నాయి. ఇక, సెల్‌ఫోన్లు, టెలివిజన్ సెట్ల తయారీలో అతిపెద్ద మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు సెల్‌కాన్, ఫాక్సన్, డిక్సన్ వంటివి తిరుపతి, శ్రీసిటీలో ఉన్నాయి. వైర్‌మ్యాక్స్, గ్రీన్‌ప్లై, మొండెలేజ్, ఇసుజి, కోల్గేట్, కెలోగ్స్, షాహి ఎక్స్‌పోర్ట్స్ వంటి అతి భారీ పరిశ్రమలూ ఏర్పాటయ్యాయి. అమరరాజా విస్తరణలో భాగంగా యాదమరి మండలంలోనూ ప్లాంట్‌ను నెలకొల్పారు.

ఉమ్మడి జిల్లాలో పెద్ద, భారీ తరహా పరిశ్రమల ప్రగతి ఇలా

సంవత్సరం	పెట్టుబడులు (రూ.కోట్లలో..)	పరిశ్రమలు
2014-15	235	1,611
2015-16	398	2,104
2016-17	491	2,941
2017-18	826	2,377
2018-19	1076	10,419
మొత్తం	3,026	19,452



● ఇక, టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద, భారీ పరిశ్రమలు 2135 వచ్చాయి. వీటి ద్వారా 1,29,619 మంది ఉపాధి పొందారు.

ఒక్క భారీ పరిశ్రమా తేలేకపోయిన వైసీపీ

జిల్లాల పునర్విభజనతో భారీ పరిశ్రమలు, విద్యాసంస్థలు తిరుపతి జిల్లాలో ఉండిపోయాయి. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాను అభివృద్ధి చేయడంపై ఇక్కడి మంత్రులు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టలేదు. 2023లో రూ.90 కోట్లతో 651.. 2022లో రూ.13.74 కోట్లతో 334 ఎంఎస్ఎంఈ పరిశ్రమలు ప్రారంభించామని గతేడాది ఆగస్టు 15న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉషశ్రీచరణ్ తన ప్రసంగంలో చెప్పారు. క్షేత్రస్థాయిలో వీటి పరిస్థితి ఏంటో మరి. ఇక, ఒక్కటంటే ఒక పెద్ద పరిశ్రమ జిల్లాకు రాలేదని అధికారికంగా అంగీకరించారు.

'కోసలనగరం'నూ పట్టించుకోలేదు



తమిళనాడు సరిహద్దు అయిన విజయపురం మండలం కోసలనగరంలో పరిశ్రమల స్థాపనకు టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాటి ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు చొరవతో.. 2017లో 650 ఎకరాలు, 2018లో 1520 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించారు. 200 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు కొందరు పారిశ్రామికవేత్తలు ఎంవోయూ చేసుకున్నారు. నీళ్లు, కరెంటు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. దీనికోసం కృష్ణయ్య కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలుగుగంగ నీటిని శ్రీహరిపురం చెరువుకు తీసుకొచ్చి.. అక్కడ్నుంచి ఎత్తిపోతల ద్వారా ఈ పారిశ్రామిక వాడకు నీటి వసతి కల్పించాలని నిర్ణయించారు. విద్యుత్ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పరిశ్రమల గురించి పట్టించుకోలేదు. కాకుంటే, ఇటీవల 29 మంది రైతులకు భూమికి సంబంధించి పరిహారం ఇచ్చారు. మామిడి చెట్లకు ఇవ్వలేదని చెబుతున్నారు. ఇక, నగరి మండలం వీకేఆర్‌పురం పంచాయతీలో 250 ఎకరాలను టీడీపీ హయాంలోనే సేకరించారు. ఇక్కడా పరిశ్రమల ప్రస్తావన లేదు. ఈ ఐదేళ్లలో రైతులకు పరిహారం ఇచ్చి, మౌలిక వసతులు కల్పించి పరిశ్రమలను తీసుకొచ్చేందుకు మంత్రి రోజా చొరవ చూపలేదు. దీంతో 10 వేల మందికిపైగా ఉపాధి లేకుండా పోయింది.

- నగరి

అమరరాజను వేధించి వెళ్లగొట్టారు

రేణిగుంట మండలం కరకంబాడి వద్ద 1985 డిసెంబరులో గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి దంపతులు అమరరాజా బ్యాటరీస్‌ను స్థాపించారు. రూ.11 వేల కోట్లకు పైగా వార్షిక టర్నోవర్‌తో నడుస్తున్న ఈ పరిశ్రమ జిల్లాలో 16 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతోనే అమరరాజపై వేధింపులు మొదలయ్యాయి. యాదమరి మండలం నూనెగుండ్లపల్లె వద్ద కూడా అమరరాజా సంస్థ బ్యాటరీల తయారీ ప్రారంభించింది. ఈ రెండు చోట్లా తొమ్మిది యూనిట్ల వల్ల కాలుష్యం ఏర్పడుతోందంటూ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జారీ చేసిన ఆదేశాలతో 2021 మే 1న ఎస్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో సంస్థకు రూ.50 కోట్ల మేర నష్టం వాటిల్లింది. తర్వాత కూడా వేధింపులు కొనసాగాయి. దీంతో జిల్లాలో రూ.9500 కోట్లతో నెలకొల్పాల్సి ఉన్న లిథియం బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఆ సంస్థ తెలంగాణకు తరలించింది. దీనివల్ల జిల్లాలోని 4500 మంది ఉపాధి కోల్పోయారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా వున్న వాటిని వెళ్లగొట్టేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుపై జనం మండిపడుతున్నారు.



టూచ్...!

ఒక్క పరిశ్రమా ఏర్పాటు కాలేదు

● పుంగనూరులో భూసేకరణ, శంకుస్థాపనలతోనే సరి

పుంగనూరులో 2,200 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటవుతుంది. ఉద్యోగ, ఉపాధి కోసం యువత ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు.

అలాగని చెప్పి మూడు చోట్ల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఒక్క దానికి కూడా అడుగులు పడలేదు.

- పుంగనూరు



శంకుస్థాపనతో సరి

పరిశ్రమ పేరు: జిక్సిన్ వారి సిలిండర్లు, బ్యాటరీల తయారీ, **సేకరించిన భూములు:** 38 ఎకరాలు
ఎక్కడ: పుంగనూరు మండలం మిట్టచింతలపల్లె వద్ద, **పెట్టుబడి:** రూ.57 కోట్లు ,**ఉపాధి:** 900 మందికి
శంకుస్థాపన జరిగింది: 2021 జూలై ఒకటో తేది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, కంపెనీ ఎండీ రాహుల్ కరణం శంకుస్థాపన పాల్గొన్నారు.

ఆ తర్వాత ఏం జరిగింది

కంపెనీ ఎండీ రాహుల్ హత్యకు గురయ్యారు. పరిశ్రమ అటకెక్కింది. ఆ స్థలం నిరుపయోగంగా ఉంది.

ఏడాదిగా ఇంతే

పరిశ్రమ పేరు: ఫెర్రో అల్లాయ్స్ డీఐ పైపుల పరిశ్రమ
కేటాయించిన స్థలం: 62.47 ఎకరాలు
పెట్టుబడి: రూ.165 కోట్లు
ఎక్కడ: పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద
శంకుస్థాపన చేసింది: 2023 మార్చి 24న
ఉపాధి: ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 600 మందికి
తర్వాత ఏం జరిగిది: పరిశ్రమ ఏర్పాటుకు పక్కనే యుద్ధప్రాతిపదికన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. ఆ తర్వాత ఎలాంటి నిర్మాణాలు జరగలేదు.





శంకుస్థాపన చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)





గాయత్రి సిలెండర్ల ఫ్యాక్టరీకి వేసిన శిలాఫలకం, స్థలం

అనుమతి లేకుండానే..!

పరిశ్రమ పేరు: గాయత్రి సిలెండర్స్ ప్రైవేటు లిమిటెడ్
పారిశ్రామిక వేత్త: మదనపల్లెకి చెందిన వైసీపీ నేత జబ్బల శ్రీనివాసులు
శంకుస్థాపన జరిగింది: ఆరడిగుంట వద్ద 2022 ఆగస్టు 21వ తేది
ఆ తర్వాత ఏమైంది: ప్రభుత్వ అనుమతిలేకుండానే ప్రక్రియ నడిచింది. చివరకు భూమి నిరుపయోగంగా, శిలాఫలకం దిష్టిబొమ్మగా కనిపిస్తోంది.

ఎన్నికల ముందు పరిశ్రమల పేరిట హడావిడి

తన నియోజకవర్గంలోనే మూడు పరిశ్రమలకు భూసేకరణ జరిపి వదిలేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఎన్నికలకు ముందు మరోసారి పరిశ్రమల హడావిడి చేశారు. భూసేకరణ పేరిట గ్రామస్థులను ఆందోళనకు గురిచేశారు.

పరిశ్రమ పేరు: జర్మనీకి చెందిన పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల తయారీ, **స్థల పరిశీలన:** గతేడాది డిసెంబరు ఒకటో తేది
ఎక్కడ: పుంగనూరు మండలం గోపిశెట్టిపల్లె సమీపంలోని 800 ఎకరాల్లో
పెట్టుబడి: రూ.5 వేల కోట్లు, **ఉపాధి:** 10 వేల మంది
విస్తరణ: రెండు వేల ఎకరాల్లో మరో పది కంపెనీలు
లక్ష్యం: 2027కు మార్కెట్‌లోకి 50 వేల వాహనాలు తేవడం
ఏమైంది: ఇంత ఆర్భాటం చేసి, సీఎం జగన్‌ను రెండుమార్లు కలిసినా ఇంతవరకు పరిశ్రమ ఊసేలేదు., **గ్రామంలో పరిస్థితి:** మా ప్రాణాలు పోయినా భూములివ్వబోమని రైతులు తేల్చి చెప్పారు. బలవంతంగా భూములు తీసుకుంటే మాకు చావే గతి అన్నారు. ఆందోళనలు చేశారు.



జర్మనీ పెప్పర్‌మోషన్ ఎలక్ట్రిక్ వాహన తయారీ పరిశ్రమ స్థాపన స్థలాన్ని పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు(ఫైల్‌ఫొటో)